


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 18-09-2019 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 08 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## అర్జీల పరిష్కారంపై
# అలసత్వం చూపొద్దు

కార్యాచరణ ప్రణాళిక తయారుచేసుకోవాలి

అప్పుడే స్పందనకు అర్థం ఉంటుంది

ముఖ్యమంత్రి జగన్ మహన్ రెడ్డి



అమరావతి : స్పందన కార్యక్రమం ద్వారా అందే వినతుల పరిష్కారంలో నాణ్యత కోసం అధికారులు వర్క్‌షాపులు నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. దీనిపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మార్వోలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు వర్క్ షాపులు నిర్వహించాలన్నారు. స్పందన కార్యక్రమంపై మంగళవారం సీఎం జగన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అర్జీల పరిష్కారంపై అలసత్వం చూపొద్దని జగన్ స్పష్టం చేశారు. సమస్యలు తీరుస్తారన్న ఆశతో

తరువాయి 2లో..

## మాతృదేవోభవ..

తల్లి ఆశీస్సులు పొందిన ప్రధాని మోదీ



గాంధీనగర్: దేశానికి రాజైనా.. తల్లికి మాత్రం బిడ్డే. ఈ సామెత ప్రధాని నరేంద్ర మోదీ విషయంలో అక్షర సత్యం అనిపిస్తుంది. మిగతా రోజుల్లో ఊపిరి సలపని బాధ్యతలతో బిజీగా ఉండే మోదీ.. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రం తప్పకుండా తల్లి హీరాబెన్‌ను కలుస్తారు. అలానే తన పుట్టిన రోజు సందర్భంగా తల్లి సమక్షంలో కాసేపు గడిపారు మోదీ. ప్రస్తుతం మోదీ తల్లి హీరాబెన్.. గాంధీనగర్‌కు సమీపంలోని రైసిన్ గ్రామంలో చిన్నకుమారుడైన పంకజ్ మోదీ దగ్గర ఉంటున్నారు. ఈ క్రమంలో పుట్టిన రోజు సందర్భంగా మోదీ మంగళవారం తల్లి దగ్గరకు వెళ్లి ఆమె ఆశీర్వాదం తీసుకుని.. ఆమెతో కలిసి

తరువాయి 2లో..

### నేడు అధికార లాంఛనాలతో
## కోడెల అంత్యక్రియలు



అమరావతి: టీడీపీ సీనియర్ నేత, మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు అంత్యక్రియలు అధికార లాంఛనాలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఆదేశించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యంకు ఆదేశాలిచ్చారు.

తరువాయి 2లో..

## టీటీడీ బోర్డు సభ్యుల జాబితా విడుదల



ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

తిరుమల: టీటీడీ పాలక మండలి సభ్యుల జాబితాను విడుదల చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. **తమిళనాడు నుంచి ...** 1) కృష్ణమూర్తి వైద్యనాథన్, 2) ఎస్ శ్రీనివాసన్, 3) డాక్టర్ నిచిత ముత్తవరపు, 4)కుమరగురు ఎమ్మెల్యే. **తెలంగాణ నుంచి..** 1) జూపల్లి రామేశ్వరరావు, 2)బి. పార్థసారథి రెడ్డి, 3)యూ. వెంకట భాస్కర రావు, 4) సిద్ధిపేటకు చెందిన మూరంషెట్టి రాములు, 5)డి. దామోదర్ రావు, 6)కె. శివకుమార్,7) పుట్టా ప్రతాపరెడ్డి **ఆంధ్రప్రదేశ్ నుంచి...** 1) వి. ప్రశాంతి, 2)యూ. వి. రమణమూర్తి ఎమ్మెల్యే, 3)గొల్ల బాబురావు ఎమ్మెల్యే, 4) మల్లికార్జున్‌రెడ్డి ఎమ్మెల్యే, 5) నాదేండ్ల సుబ్బారావు, 6)డీపీ అనిత, 7) చిప్పగారి ప్రసాద్ కమార్,

తరువాయి 2లో..

### బోటు ప్రమాదం

## మరో 14 మృతదేహాలు లభ్యం

కొనసాగుతున్న గాలింపు చర్యలు



రాజమండ్రిః గోదావరిలో గల్లంతైన వారి కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. మంగళవారం ఇప్పటి వరకు మరో 14 మృతదేహాలను కనుగొన్నారు. నీటి ఉధృతి కారణంగా బోటును వెలికితీసే పనులకు ఆటంకం కలుగుతోంది. గోదావరిలో బోటు మునిగిన ప్రమాదంలో గల్లంతైన వారిలో మరో 14 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. దీంతో మృతుల సంఖ్య 22కి చేరింది. ప్రమాదం జరిగిన కచ్చులూరు దేవీపట్నం, పట్టిసీమ, పోలవరం, తాళ్లపూడి వద్ద మృతదేహాలను కనుగొన్నట్లు సమాచారం. బోటు మునిగి మూడు రోజులు కావడంతో మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా ఉబ్బిపోయాయని, మృతులను గుర్తించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

**గోదావరి బోటు ప్రమాదం**
**మరో మృతదేహం గుర్తింపు**

నిన్నటి వరకు 8 మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయి. మంగళవారానికి ఆ సంఖ్య 22కి పెరిగింది. ఎన్డీఆర్ఎఫ్, నేవీ బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడం సహాయక చర్యలకు

తరువాయి 2లో..

## కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదు

- కోడెల మరణానికి చంద్రబాబే పరోక్షకారణం
- పార్టీ అంతర్గత కలహాలతోనే ఆత్మహత్య
- కోడెల కాల్‌డేటాను విచారించాలి
- పౌరసరఫరాల శాఖమంత్రి కొడాలి నాని

అమరావతి: తమ ప్రభుత్వం ఎవరిపైనా కక్షసాధింపు చర్యలకు పాల్పడట్లేదని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖమంత్రి కొడాలి నాని స్పష్టం చేశారు. మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు మరణానికి చంద్రబాబు నాయుడే పరోక్ష కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. పదిరోజుల పాటు చంద్రబాబు కనీసం ఆయనకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని, నమ్మిన నాయకుడు, పార్టీ చేసిన అవమానంతోనే ఆత్మహత్య చేసుకున్నారని భావిస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 9 గంటల వరకు కూడా చంద్రబాబతో భేటీకి కోడెల ప్రయత్నించారని, దానికి నిరాకరించడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారని మంత్రి పేర్కొన్నారు. కోడెల ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, ప్రభుత్వం కేసులు పెడితే పోరాడే తత్వం కలిగిన వ్యక్తిఅని వ్యాఖ్యానించారు. కోడెలను ప్రభుత్వం వేధించిందంటూ చంద్రబాబు ఇష్టానుసారంగా విమర్శలు చేయడం సరికాదన్నారు. ఫర్నిచర్, బిల్డర్లు కేసు కానీ ప్రభుత్వం పెట్టింది కాదని.. అసెంబ్లీ ఫర్నిచర్ తన ఇంట్లో ఉందని శివప్రసాద్ అంగీకరించినట్లు మంత్రి గుర్తుచేశారు.



**పల్నాడు పులి..**
**మరి ఎందుకు అడ్డుకున్నారు?**

మంగళవారం ఆయన సచివాలయంలో మీడియా సమావేశంలో మట్లాడారు. ఏ కేసులోను ప్రభుత్వం కోడెలకు, ఆయన కొడుకు, కుతుర్లకు ఎలాంటి నోటీస్‌లు ఇవ్వలేదు. ఆయన్ని చంద్రబాబే వదిలించుకునేలా

తరువాయి 2లో..

## ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలకు నోటీసులు

ఎన్నికల పిటిషన్లపై స్పందించిన హైకోర్టు



అమరావతి: టీడీపీ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, అనగాని సత్యప్రసాద్, గద్దె రామ్మోహన్‌ల ఎన్నికను సవాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు దాఖలు చేసిన ఎన్నికల

తరువాయి 2లో..




## మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాం

- వృత్తిపరమైన శిక్షణ కూడా ఇస్తున్నాం
- సీఎం జగన్‌తో ఫాక్స్‌కన్ ఇండియా ఎండీ భేటీ



అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం సచివాలయంలో ఫాక్సికన్ ఇండియా ఎండీ జోష్ ఫాల్గర్ కలిశారు. ఈ సందర్భంగా సంస్థ కార్యకలాపాలను ముఖ్యమంత్రికి వివరించిన ఫాల్గర్, నెల్లూరు జిల్లా శ్రీ సిటీలో ఉన్న కంపెనీ ద్వారా దాదాపు 15 వేల మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. వారందరికి వృత్తిపరమైన శిక్షణ కూడా ఇచ్చామని చెప్పారు. కంపెనీ ఉత్పాదక సామర్థ్యం కూడా పెంచబోతున్నామన్న జోష్ ఫాల్గర్ , ప్రస్తుతం నెలకు 35 లక్షల సెల్‌ఫోన్లు విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. కాగా, ఎలక్ట్రానిక్ రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తెలిపారు. రాష్ట్రాన్ని ఎలక్ట్రానిక్ హబ్‌గా తీర్చిదిద్దడానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు. పెట్టుబడులకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. ఉత్తమ నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేయడానికి అత్యుత్తమ ప్రమాణాలతో ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మరింత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే దీని ఉద్దేశమన్న సీఎం జగన్, ఆ దిశలో ఫాక్సికన్ కంపెనీ కూడా ముందుడుగు వేయాలని ఆకాంక్షించారు.

# ప్లాస్టిక్ రహిత సమాజంతోనే సంపూర్ణ ఆరోగ్యం



వేములపూడి, చెట్టుపల్లి పంచాయతీల్లో ప్లాస్టిక్ నివారణ చర్యలు

నర్సీపట్నం: ప్లాస్టిక్ రహిత సమాజంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని పంచాయతీ పరిపాలనాధికారి దేవాడ సంజీవరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేదం అందరి బాధ్యత అన్నారు. ఒక్కసారి వాడిన ప్లాస్టిక్ తిరిగి వాడకూడదన్నారు. గ్రామ వాలంటీర్లతో కలిసి ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా ఎంపిడిఒ ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా వేములపూడి, చెట్టుపల్లి పంచాయతీల్లో ప్లాస్టిక్ నివారణ చర్యలు చేపట్టారు.

## వైయస్సార్ చేయూత కోసం ఆటో డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలి

మాకవరపాలెం: ఆటో డ్రైవర్లు ప్రభుత్వం ప్రకటించిన పది వేల రూపాయలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఒ అరుణశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైయస్సార్ చేయూత పథకంలో భాగంగా ఆటో డ్రైవర్లకు ఈ ఏడాది నుంచి ప్రభుత్వం ఆర్థిక సహాయం ప్రకటించిన నేపథ్యంలో అర్హులంతా ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## మాజీ స్పీకర్ కోడెలకు ఘన నివాళి



నర్సీపట్నం: నర్సీపట్నం తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు మంగళవారం మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌కు ఘనంగా నివాళ్లు అర్పించారు. అబీద్‌సెంటర్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి, మాజీ కౌన్సిలర్లు రావాడ నాయుడు, రుత్తల కృష్ణ, పైల గోవిందరావు, సిబిఎన్ ఆర్మీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు(బుజ్జి), తెలుగు యువత అధ్యక్షులు లాలం మురళీకృష్ణ, ధనిమిరెడ్డి మధు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనాధలకు భోజన ప్యాకెట్లు పంపిణీ



నర్సీపట్నం: నర్సీపట్నం బిజెపి పట్టణశాఖ ప్రధాన కార్యదర్శి ఎడ్ల గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం పెదబొడ్డేపల్లిలో గల హోమ్‌లెస్ సెంటర్‌లో వృద్ధులు, అనాధలకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. అదే విధంగా బిజెపి నాయకులు దార్ల ప్రభాకర్, కె.సంతోష్, అసెంబ్లీ కన్వీనర్ కాళ్ల సుబ్బారావులు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు, గర్భిణీలు, బాలింతలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాదే శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## భారతదేశాన్ని అగ్రగామిగా నిలబెట్టిన ఘనత ప్రధాని మోదీదే

### బిజెపి యువమోర్చ రాష్ట్ర కార్యదర్శి నగిశెట్టి గంగబాబు



మాకవరపాలెం: సాధారణ, సామాన్య వ్యక్తి నుండి అసాధారణ, అసామాన్య శక్తిగా మారి ప్రపంచ దేశాల ముందు భారతదేశాన్ని అగ్రపథంలో నిలబెట్టిన ఘనత భారతదేశ ప్రధాని నరేంద్రమోదీదేనని బిజెపి యువమోర్చ రాష్ట్ర కార్యదర్శి నగిశెట్టి గంగబాబు అన్నారు. మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ 69వ జన్మదినంను పురస్కరించుకొని మాకవరపాలెం పిహెచ్‌సి వద్ద మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా గంగబాబు మాట్లాడుతూ అవినీతి, ఆరోపణ లేకుండా నిజాయితీగా కూడిన పాలనను మోదీ అందిస్తున్నార న్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా దేశం మొత్తం అనేక సేవా కార్యక్రమాలు చేస్తుంద న్నారు.

దీనిలో భాగంగానే ఇక్కడ మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయ కులు శివ రామకృష్ణ, రఘుచక్రవర్తి, బంగారు ఎర్రినాయుడు, సన్యాసిరావు, కనకరాజు, మాకవర పాలెం పిహెచ్‌సి సిబ్బంది టీబి సూపర్‌వైజర్ సిహెచ్.ముల్లయ్య, స్టాఫ్ నర్సు ప్రశాంత్, ఎల్‌టి శ్రీదేవి, మేరి, ఎల్‌టి సుదీర్ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

### డివిజనల్ పంచాయతీ అధికారి కృష్ణకుమారి



నాతవరం: ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి వంగా కృష్ణకుమారి చెప్పారు. మంగళవారం మండలంలో ఎర్రవరం గ్రామంలో ఆమె పర్యటించారు. ముఖ్యంగా గ్రామంలో ప్రత్యేక పారిశుద్య గ్రామంలో తీర్చిదిద్దేందుకు గ్రామస్థులందరూ సహకరించాలని కోరారు. అలాగే ప్లాస్టిక్ నిర్మూలన కూడా గ్రామస్థులు సహకరించాలని కోరారు. అనంతరం స్వయంగా దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ వినియోగించవద్దంటూ కోరారు. అనంతరం పారిశుద్య నిర్మూలనపై స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ యాదగిరీశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ జయరాం, పంచాయతీ కార్యదర్శి త్రిమూర్తులు హౌసింగ్ ఎఇ గ్రామస్థులు పాల్గొన్నారు.

## పేదలకు బట్టలు, రోగులకు పండ్లు పంపిణీ



నాతవరం : నాతవరంలో ప్రధాని మోదీ 69వ జన్మదిన వేడుకల్లో భాగంగా బిజెపి నాయకులు పేరూరి బుల్లిదొర, కరక సరసింహ మూర్తి ఆధ్వర్యంలో మంగళవారం పేద లకు బట్టలు పంపిణీ చేశారు. అదే విధంగా బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు గొంప సత్యనారాయణ ఆధ్వర్యంలో నాతవరం పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్.విక్రమ్, కుమారస్వామి, త్రినాధ్, వెంకటరమణ, జగన్, భవానీ, రుషి, రజని, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

## రికార్డుల శుద్ధీకరణతో రైతులకు మేలు

### -నేడు బెతపూడిలో రెవెన్యూ గ్రామసభ
### -తహశీల్ధార్ జె.రమేష్‌బాబు



దేవరపల్లి : రికార్డులు శుద్ధీకరణతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తహశీల్దార్ జె. రమేష్ బాబు అన్నారు. మంగళ వారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ,గతంలో జరిగిన రికార్డుల శుద్ధీకరణ కంటే నేటి నుంచి ఒక్కొక్క గ్రామాన్ని రికార్డుల శుద్ధీకరణ ఒక క్రమ పద్ధతిలో చేసుకు వెళ్తామని ఇందుకోసం ముందుగా మండలంలోని బేతపూడి రెవెన్యూ విలేజ్ ను ఎంపిక చేసుకున్నామని బుధవారం ఈ గ్రామంలో గ్రామ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ గ్రామసభలో అపరిష్కృతముగా ఉన్న భూ రికార్డుల సమస్యలను పరిష్కరించి విషయమై ఈ గ్రామ సభ నిర్వహిస్తున్నామని అలాగే సాగుదారులు ,పెండింగ్ లో ఉన్న చనిపోయిన ఖాతాదారులు యొక్క పాస్ పుస్తకములు రిజిస్టర్ దస్తావేజులు ద్వారా కొనుగోలు చేసిన, నోషనల్ ఖాతాలను రెగ్యు లర్ ఖాతాలు మార్పు చేయుటకు గాను ఈ గ్రామసభ నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు. ఈ గ్రామసభను యావన్మంది రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## లంకెలపాలెంలో ఘనంగా విశ్వకర్మజయంతి ఉత్సవములు



పరవాడ : శ్రీకామాక్షి వీరభద్ర స్వామి విశ్వ బ్రహ్మణ సంఘం అద్వర్యంలో మంగళ వారము విశ్వకర్మజయంతి వేడుకులు ఘనంగా జరిగాయి. ఈకార్య క్రమానికి ముఖ్యఅతిథిలుగా పాల్గొన్న స్టేట్ వైసిపిసేవాదళ్ సెక్ర్యటరీ ఇల్లపుప్రసాద్ , వై.వి.నరశింహం, రౌతు శ్రీను వాసురావు, సుందరపు అప్పా రావు, జిల్లా విశ్వబ్రహ్మణ సెక్రటరీ సిహెచ్ సూరిబాబుకు సన్మానము చేసారు. అనంతరము ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కె.అప్పారావు, ఉప అధ్య క్షులు కె.సత్య నారాయణ, సెక్రటరీ పెదపాటి రామచంద్రరావు, కోశాధికారి సిహెచ్‌విఎన్ అచారి, సలహదారు రామమూర్తిచారి, గౌరవ అధ్యక్షులు రాము తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు అడ్డంగా వేసిన దడిని తొలగించండి



దేవరాపల్లి : స్థానిక అంబేద్కర్ కాలనీలోని రొప్పల సన్యాసి ఇంటి వద్ద కొందరు అక్రమంగా వేసిన దడిని తొలగించాలని కాలనీ వాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి, ఎస్ సి కాలనీలో ఉత్తర భాగంలో తమ ఇల్లులు ఉన్నాయని, తాము ఈ రోడ్డు వైపే రాక పోకలు సాగిస్తామని అయితే తూర్పు భాగాన ఉన్న కొంత మంది వ్యక్తులు రోడ్డుకు అడ్డంగా దడి కట్టి తమ రాకపోకలకు దారి లేకుండా చేస్తున్నారని సన్యాసి, అప్పన్న, దేముడమ్మ, భీంపల్లి సూర్యనారాయణ, చంద్ర శేఖర్ తదితరాలు సోమవారం ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ కార్యదర్శికి చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## అక్టోబర్ 2వరకు ఆయుష్మాన్‌భవ పక్షోత్సవాలు

రోలుగుంట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయుష్మాన్ భారత్ పక్షోత్సవాలను విజయవంతానికి కృషి చేయాలని బుచ్చెంపేట పిహెచ్‌సి వైద్యాధికారి సునీత పేర్కొన్నారు. ఈ సందర్భంగా...

ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వచ్చే నెల రెండో తేదీవరకు ఆరోగ్య చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పంచాయతీ అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది అందరూ పాల్గని ప్రజలకు వైద్య ఆరోగ్య పథకాలు, అంటువ్యాధులు, మద్యపానం, ధూమపానం, పరిసరాల శుభ్రత, ప్రాధమిక ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని కోరారు.

మొదటి పేజీ తరువాయి

## అర్జీల పరిష్కారంపై అలసత్వం చూపొద్దు

ప్రజలు అధికారుల దగ్గరకు వస్తారని, వారి స్థానంలో ఉండి ఆలోచించి అధికారలు స్పందించాలని సూచించారు. అప్పుడే స్పందనకు అర్థ ఉంటున్నారు. ఎమ్మార్వోలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు మరింత మానవీయ దృక్పథంతో వినతులకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

వినతుల విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉంటుంది

రాష్ట్రస్థాయిలో చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఈ నెల (సెప్టెంబర్ )24, 27 తేదీలలో వర్క్‌షాపు నిర్వహించాలని సీఎం జగన్ సూచించారు. అక్టోబర్‌లో జిల్లా స్థాయిలో వర్క్‌షాపులు నిర్వహించాలని ఆదేశించారు. దిగువ స్థాయి అధికారులకు మరింత మోటివేషన్ పెంచడమే దీని ఉద్దేశమన్నారు. కలెక్టర్లు కూడా ఈ వర్క్ షాపులో పాల్గొనాలన్నారు. నవంబర్ నుంచి స్పందన వినతుల విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉంటుందని హెచ్చరించారు.

అక్టోబరు 2 నుంచి గ్రామ సెక్రటేరియట్లు

గ్రామ సెక్రటేరియట్లను అక్టోబర్ 2 నుంచి ప్రారంభిస్తున్నామని సీఎం జగన్ తెలిపారు. సచివాలయాల్లో సోషల్ ఆడిట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.కొత్త రేషన్‌కార్డులు, పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి డిసెంబరు నుంచి ఇవ్వాలి. అక్టోబరు, నవంబరు నెలల్లో సామాజిక తనిఖీలు పూర్తిచేయాలి. గ్రామ, వార్డు సెక్రటేరియట్ అందుబాటులోకి రాగానే అక్కడే డిస్‌ప్లే ఉండాలి. రేషన్‌కార్డులు, పెన్షన్లు ఉన్నవారి జాబితాను బోర్డులో పెట్టాలి.ఇళ్లపట్టాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితా కూడా పెట్టే ప్రయత్నం చేయాలి. ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను పెట్టాలి. ఈ జాబితామీద ఏమైనా అభ్యంతరాలు ఉన్నా, పథకం ఎవ్వరికీ అందకపోయినా ఆ సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలి.అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలి. వారికి అందించాల్సిన ధర్మం, బాధ్యత మనదే అని సీఎం జగన్ అధికారులతో పేర్కొన్నారు.

ఇళ్లస్థలాలు పంపిణీపై సమీక్ష

ఉగాది నాటికి పేదలందరికీ ఇళ్లస్థలాలను పంపిణీ చేయాలని, దీని కోసం లబ్ధిదారుల ఎంపిక, వెరిఫికేషన్ వేగవంతం చేయాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ ఆఖరు నాటికి డేటా కలెక్షన్, వెరిఫికేషన్ పూర్తికావాలన్నారు. అక్టోబర్ చివరి నాటికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి ఎంతో తేల్చాలన్నారు. నవంబర్ నుంచి అవసరమైన చోట భూముల కొనుగోలు ప్రక్రియ చేపట్టాలన్నారు.

ఇసుక కొరతపై సమీక్ష

ఇసుక కొరతపై సీఎం జగన్ కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. వర్షాలు, వరదలు కారణంగా ఇసుక అందుబాటులోకి రాలేదని అకారులు సీఎం జగన్‌కు వివరించారు. గోదావరి, కృష్ణా నదుల్లో ఇంకా ప్రవాహాలు ఉన్నాయని, వరద తగ్గిన వెంటనే రీచ్‌లు అందుబాటులోకి వస్తాయన్నారు. వరద తగ్గగానే వీలైనంత ఇసుకను స్టాక్‌యార్డుల్లోకి తరలించడానికి ముమ్మర ప్రయత్నాలు చేయాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు.

## నేడు అధికార లాంఛనాలతో కోడెల అంత్యక్రియలు

కాగా, కోడెల శివప్రసాదరావు పార్థీవ దేహాన్ని హైదరాబాద్ నుంచి నరసరావుపేటకు తరలిస్తున్నారు. కార్యకర్తల సందర్శనార్థం భౌతికకాయాన్ని మంగళవారం మధ్యాహ్నం గుంటూరులోని టీడీపీ కార్యాలయంలో ఉంచారు. నేడు నరసరావుపేటలో అంత్యక్రియలు నిర్వహిస్తారు. సోమవారం హైదరాబాద్‌లో అనుమానాస్పదరీతిలో కోడెల శివప్రసాదరావు మృతి చెందారు. ఆయన ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

## మాతృదేవోభవ..

కూర్చుని భోజనం చేశారు. అనంతరం తల్లితో, చుట్టుక్కల వారితో కాసేపు ముచ్చటించారు మోదీ. కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా హీరాబెన్ మోదీకి 501 రూపాయలను బహుమతిగా ఇచ్చారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించిన తర్వాత మోదీ తొలుత తల్లి హీరాబెన్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా పుట్టిన రోజు సందర్భంగా సోమవారం రాత్రే గుజరాత్ చేరుకున్న మోదీ మంగళవారం పలు కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. నర్మదా నదిపై ఉన్న సర్దార్ సరోవర్ డ్యామ్‌ను, వల్లభ్ భాయ్ పటేల్ విగ్రహాన్ని సందర్శించారు. అనంతరం గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీతో కలిసి నమామి నర్మద మహోత్సవాన్ని ప్రారంభించారు. అలానే సర్దార్ సరోవర్ డ్యామ్‌కు సమీపంలోని బటర్‌ఫ్లై పార్క్‌ను కూడా సందర్శించారు మోదీ. ఈ క్రమంలో ఓ బ్యాగులో తీసుకువచ్చిన సీతాకోక చిలుకలను బయటకు వదిలి పెట్టారు మోదీ.

మోదీకి సీఎం జగన్ జన్మదిన శుభాకాంక్షలు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోదీ నేడు 69వ పుట్టిన రోజుల వేడుకలను జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా.. ప్రధాని మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, జీవితాంత ఇలానే సంతోషంగా, ఆరోగ్యంగా ప్రజా జీవితంలో ఉండాలి అంటూ ట్విటర్‌లో పోస్ట్ చేశారు. దేశ వ్యాప్తంగా మోదీకి శుభాకాంక్షలు అందుతున్నాయి. 69వ జన్మదినం సందర్భంగా తొలుత గుజరాత్‌లోని గాంధీనగర్‌లో తన తల్లి హీరాబెన్‌ను కలుసుకుని ఆమె ఆశీస్సులు పొందారు.

## టీటీడీ బోర్డు సభ్యుల జాబితా విడుదల

8) కె. పార్థసారథి ఎమ్మెల్యే, ఢిల్లీ నుంచి... 1) ఎమ్ ఎస్ శివ శంకరన్, కర్ణాటక నుంచి... 1) రమేశ్ శెట్టి, 2) సంపత్ రవి నారాయణ, 3) సుధా నారాయణమూర్తి, మహారాష్ట్ర నుంచి ... 1) రాజేశ్ శర్మ, ఎక్స్‌అఫిసియో సభ్యులుగా.. 1) తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట చైర్మన్, 2) ఎస్పీల్ సీఎస్, 3) ఎండోమెంట్ కమిషనర్, 4)టీటీడీ ఈవో.

## కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదు

వ్యవహరించారు. కోడెలను పార్టీలో దూరం పెట్టి అవమానించారు. అసెంబ్లీ ఫర్నిచర్ కేసులో వర్ల రామయ్యతో విమర్శలు చేయించారు. అందుకే కోడెల లాంటి వ్యక్తి అలాంటి చర్యకు పాల్పడ్డారు. 1999 లో బాంబుల కేసు విచారణ చేసి అవమానించింది చంద్రబాబు కాదా..? 2014 లో కోడెల పుట్టిన నరసరవు పేట సీటు కాదని సత్తెనపల్లి పంపి అవమానించింది చంద్రబాబు కాదా..? తరువాత మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించలేదా.? పల్నాడు పులి అని ఈరోజు చెప్తున్న చంద్రబాబు. మరి కోడెలను పల్నాడు రాకుండా ఎందుకు అడ్డకున్నారు.

కోడెల కాల్‌డేటాను విచారించాలి

కోడెలకు వ్యతిరేకంగా సత్తెనపల్లిలో వర్గాన్ని తయారు చేసింది ఎవరు..? ఇప్పుడు కోడెల మృతదేహం వద్ద కూర్చుని చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తున్నారు. ఎన్టీఆర్‌ని కూడా ఇలానే క్షోభకు గురి చేసి చంపించి తరువాత శవం వద్ద మొసలి కన్నీరు కార్చారు. కోడెలను ప్రభుత్వం వేధిస్తోందంటూ.. ఈ 3 నెలల్లో ఎప్పుడయినా చంద్రబాబు మాట్లాడారా..? ఆయనకు మద్దతుగా ఎవ్వరిని మాట్లాడనివ్వ లేదు. చంద్రబాబు కోడెలను ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించి వేధించారు. తెలంగాణ ప్రభుత్వం కోడెల కాల్డేటాను విచారించాలి. ఇందులో చంద్రబాబు పాత్రపై విచారణ జరపాలి అని అన్నారు.

## ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలకు నోటీసులు

వ్యాజ్యాలపై హైకోర్టు స్పందించింది. ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీచేసింది. అలాగే ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు సైతం నోటీసులిచ్చింది. తదుపరి విచారణను అక్టోబర్ 14కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ మల్లవోలు సత్యనారాయణమూర్తి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్, జస్టిస్ ఎం.గంగారావు వేర్వేరుగా ఉత్తర్వులు జారీచేశారు. విశాఖ ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గంటా శ్రీనివాసరావు ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ కె.కన్నప్పరాజు, రేపల్లె నుంచి అనగాని సత్యప్రసాద్ ఎన్నికను సవాలు చేస్తూ మోపిదేవి వెంకటరమణ, విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి గద్దె రామ్మోహన్ ఎన్నికను రద్దు చేయాలంటూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బొప్పన భవకుమార్ తరఫున ఎన్నికల ఏజెంట్ వి.శ్రీనివాస్‌రెడ్డి హైకోర్టులో ఎన్నికల పిటిషన్లు దాఖలు చేశారు పిటిషనర్ల తరఫు న్యాయవాది మలసాని మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తి అఫిడవిట్‌లో తన ఆదాయం, వృత్తి వివరాలను తెలపాల్సి ఉండగా వీరు పొందుపర్చలేదన్నారు. అనగాని సత్యప్రసాద్ కూడా ఆదాయ వివరాలు పేర్కొనలేదని తెలిపారు. వాస్తవాలను దాచి వీరు అఫిడవిట్ దాఖలు చేశారని, ఎన్నికల నిబంధనలకు ఇది విరుద్ధమని మనోహర్‌రెడ్డి వివరించారు.

## బోటు ప్రమాదం

ఆటంకంగా మారుతోంది. అదీకాక కచ్చలూరు వద్ద గోదావరి వెడల్పు తక్కువగా ఉండడంతో ప్రవాహం అధికంగా ఉంటుంది. అక్కడ నీటిసుడులు ఏర్పడుతుండడంతో సహాయక బృందాలు ముందుకెళ్లలేకపోతున్నాయి.

*లాంచీ ప్రమాదం*

*15మందికి పైగా ప్రాణాలు నిలబెట్టిన తూటిగుంట స్థానికులు*

గోదారిలో మునిగిన బోటులోనే ఎక్కువ మంది చిక్కుకుని మృతి చెందినట్లుగా అధికారులు భావిస్తున్నారు. బోటులోని ఏసీ క్యాబిన్‌లో మృతదేహాలు చిక్కుకుపోయి ఉంటాయని భావిస్తున్నారు. క్యాబిన్‌లో ఎంతమంది ఉన్నారనే విషయంపై అంచనాలు వేస్తున్నారు. బోటు బయటకు తీస్తే మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. సుమారు 300 అడుగుల లోతులో ఉన్న భారీ లాంచీని బయటకు తీయడం అధికారులకు సవాల్‌గా మారింది. గోదావరిలో ప్రమాద సమయంలో సిబ్బందితో సహా 73మంది బోటులో ఉన్నట్లు సమాచారం. బోటు మునిగిపోతున్న సమయంలో స్థానికుల సాయంతో 27 మంది ప్రాణాలతో బయటపడ్డారు. మిగిలిన 46 మంది గల్లంతయ్యారు. ఇప్పటి వరకు గల్లంతైన వారిలో 22 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో 24 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది.

# ప్లాస్టిక్ రహితనగరంగా విశాఖను తీర్చిదిద్దండి

- ప్లాస్టిక్ బ్యాగుల బదులు గుడ్డ సంచులు, పేపర్ బ్యాగులు
- 15 రోజుల సమయం ఇచ్చిన అనంతరం జరిమానా
- ప్లాస్టిక్ నిషేధంపై అన్ని వ్యాపార సంస్థలకు నోటీసులు
- ప్రజల చైతన్యం, భాగస్వామ్యంతోనే ప్లాస్టిక్ నిషేధం
- జివిఎంసి కమిషనర్ డా.జి.సృజన

విశాఖపట్నం: నగరమంతటా ప్లాస్టిక్‌రహితంగా తీర్చిదిద్దాలని జివియంసి కమిషనర్ డా.జి.సృజన పేర్కొన్నారు. కాన్ఫరెన్స్ హాలులో ప్రజారోగ్య అధికారులు, సిబ్బందితో పారిశుధ్యం, ప్లాస్టిక్ నియంత్రణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ప్లాస్టిక్ బ్యాగులకు బదులు గుడ్డ సంచులు, పేపర్ బ్యాగులు వినియోగించేలా చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ కాలుష్య కారకమైనందున, నివారణకు, ప్లాస్టిక్ వలన కలిగేహాని గురించి ప్రజలకు వివరించాలని కోరారు.అన్ని వ్యాపార సంస్థలు ప్లాస్టిక్ వాడకంపై నిషేధం గురించి నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. 15 రోజుల సమయం ఇవ్వాలని, అప్పటికి పాటించకపోతే భారీగా జరిమానా విధించాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలను వివిధ చోట్ల ఏర్పాటు చేయడం ద్వారా అక్కడకు ప్రజలు ప్లాస్టిక్ అందించే విధంగా చూడాలని కోరారు. ప్లాస్టిక్‌ను రహదారుల నిర్మాణానికి వినియోగించేవిధంగా చర్యలు తీసుకోవాలని చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావును ఆదేశించారు. డ్రై రిసోర్స్ సెంటర్స్ తరహాలో ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తద్వారా ప్రజలకు ఆదాయంతో బాటు ప్లాస్టిక్ నిషేధం అమలుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజల భాగస్వామ్యం, చైతన్యంతోనే పారిశుద్ధ్య కార్య క్రమాలు, ప్లాస్టిక్ నివారణ సాధ్యమవు తుందని పేర్కొన్నారు. సమావేశంలో అందరు అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ మృతిలో కుట్రకోణం ఉందంటూ నల్లబ్యాడ్జీలను ధరించి రహదారిపై నిరసన తెలియచేసి కోడెల చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి., ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపిన ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకులు మరియు కార్యకర్తలు

# విశ్వకర్మ పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు



గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 68వ వార్డు గోపాలపట్నంలో విశ్వకర్మ జయంతి పూజ మహోత్సవం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. సుకర్మ విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఆయన తొలి పూజ చేశారు. విగ్రహాన్ని ఆవిష్కరించారు.

**బంట కాలనీలో....**

బంట కాలనీలో విశ్వకర్మ జయంతి పూజ మహోత్సవం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. సుకర్మ విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఆయన తొలి పూజ చేశారు.

# ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ పోటీలో గీతం విద్యార్థుల ప్రతిభ



సాగర్‌నగర్: ప్రముఖ వృత్తి నిపుణుల సంస్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియ) విశాఖ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతిభను కనబరిచి మొదటి రెండు స్థానాలలో నిలిచారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.ధర్మరాజు తెలిపారు.

ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం విద్యార్థులు వి.అనురూప్ ప్రథమ స్థానంలో నిలువగా, కె.లాస్య ద్వితీయ స్థానంలో నిలిచి ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ బహుమతులు అందుకున్నారని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థుల ప్రతిభను ఇసిఇ విభాగం అధిపతి డాక్టర్ పి.వి.వై. జయశ్రీ, ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ గీతం విద్యార్థి శాఖ కౌన్సిలర్ మహ్మద్ కె.ఎమ్.చిస్టి అభినందించారు.


**రక్షణ మంత్రిత్వ శాఖ**
**నావల్ డాక్‌యార్డు, విశాఖపట్నం**
**(టెలిఫోన్: 0891 2816350, 6366 ఫ్యాక్స్: 0891 2816688)**
**ఇ-టెండరు ప్రకటన**

కోటింగ్ నెం. **ఆర్‌పివైపి/ఎస్ఇఆర్/18-19/304**

1. నేవల్ డాకయార్డ్ విశాఖపట్నం , సీఎస్ఏఫ్ఓ విభాగం వారు ఒక సంవత్సరం కాలవ్యవధి కొరకు 36 మంది ని గేట్/పోస్ట్ అటెండెంట్‌ల సేవలను కాంట్రాక్ట్ పద్దతిలో ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా డిజిటల్ సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

2. ఇ-టెండరు డాక్యుమెంట్లు వెబ్‌సైటు: www.defproc.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోగలరు. ధరావత్తు జమ క్రింద **రూ. 1,50,200/-**లకై ఏదేని జాతీయ బ్యాంకు నుంచి తీసిన డిమాండ్ డ్రాఫ్టును ఆఫ్‌లైను డాక్యుమెంటుతో జతచేసి పంపవలెను.

3. ఆఫ్‌లైను సీలు చేసిన టెండర్లు **"ఎమ్‌వైపి"** అన్ని మార్కు చేసి నేవల్ డాకుయార్డు విశాఖపట్నం యొక్క విజయ్‌నగర్ గేటు వద్ద గల బాక్సులో వేయుటగాని లేదా ఈ కార్యాలయానికి 27 సెప్టెంబరు 19 (1830 గం.లు) లోపు చేరేలా రిజిష్టరు పోస్టు ద్వారా పంపగలరు.

**డిజిఎమ్ (ఆర్‌పి)**

**davp 10702/11/0138/1920**


# ఆదిత్య కళాశాలలో పోషన్ అభియాన్ మాసోత్సవాలు




విశాఖ సిటీ: రామ్ నగర్ లోని ఆదిత్య కళాశాల మహిళా ప్రాంగణంలో పోషన్ అభియాన్- 2కే19 పేరిట మూడవ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మహిళలు తీసుకోవలసిన ఆహార పదార్థాలు వాటి విలువల గూర్చి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జూనియర్ ఇంటర్నేషనల్ సంస్థ కార్యనిర్వహణ అధికారి పి. రజత మాట్లాడుతూ మహిళలు తీసుకోవలసిన ఆహార పదార్థాలు, వాటి పోషక విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ఈ ఆహార పదార్థాలు తీసుకోకపోవడం వల్ల కలిగే అనర్ధాలను కూలంకుషంగా విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. వెంకట లక్ష్మి ఆరోగ్యం పారిశుద్ధ్యం అనే అంశం పేరిట పిపిటిను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ హిమ శేఖర్, మూడవ ఎన్ఎస్ఎస్ యూనిట్, పిఓ పి. ప్రవీణ, కళాశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గీతం ఎంఫిల్, పిహెచ్‌డి అడ్మిషన్లు

సాగర్‌నగర్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 2019-20 విద్యాసంవత్సరానికి ఎంఫిల్. పిహెచ్‌డి ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు అహ్వానిస్తోందని అడ్మిషన్ల డైరక్టర్ ప్రొఫెసర్ కె.నరేంద్ర మంగళవారం తేది: 17-09-2019న ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు గీతం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ఈ ఏడాది అక్టోబర్ 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా అర్హులైన వారిని ఎంఫిల్, పిహెచ్‌డి లలో ప్రవేశం కల్పిస్తామన్నారు.

**ఫుల్‌టైమ్ రీసెర్చి స్కాలర్‌లకు ఫెలోషిప్**

ఫుల్‌టైమ్ రీసెర్చి స్కాలర్లుగా ప్రవేశం పొందిన వారిలో ప్రతిభ గల వారికి రీసెర్చి ఫెలోషిప్ అందజేయనున్నట్లు అడ్మిషన్ల డైరక్టర్ వెల్లడించారు. మూడేళ్ళపాటు నెలకు 15 వేల రూపాయల నుంచి 20 వేల రూపాయల వరకు ఈ స్కాలర్‌షిప్ ఉంటుందన్నారు.

# పరిమితికి మించి రవాణా చేస్తే పర్మిట్ రద్దు

**ఉప రవాణా కమిషనర్ రాజారత్నం**

విశాఖ సిటీ: ఏదైనా వాహనంలో పరిమితికి మించి అధిక లోడుతో వాహనాన్ని నడిపినట్లైతే సదరు వాహన డ్రైవర్‌ను శిక్షించడమే కాకుండా వాహనం పర్మిట్‌ను కూడా రద్దు చేయడం జరుగుతుందని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం మంగళవారం ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. సరుకు రవాణా చేయు వాహనములలో అధిక లోడు వేసి వాహనములు నడుపురాదు. గత సంవత్సరానికిగాను నిబంధనలను పాటించకుండా అధిక లోడుతో పోవు భారీ వాహనములపై 3,033 నమోదు చేసి రూ. 3,03,30,000/-, అలాగే ఈ సంవత్సరం 2,476 కేసులు నమోదు చేసి రూ. 2,47,60,000/- అపరాధ రుసుమును వసూలు చేయడం జరిగినది.

సరుకు రవాణా చేయు వాహన యజమానులకు తెలియజేయడమేమనగా అధిక లోడు వేసి నిబంధనలను వ్యతిరేకంగా వాహనమును నడిపిన ఎడల అపరాధ రుసుముతో పాటు వాహనము యొక్క పర్మిట్‌ను రద్దు చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడమైంది. కనుక వాహన యజమానులందరు గమనించమని తెలియజేయడమైనదని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలియజేయడమైనది.

# ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



విశాఖ సిటీ : ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ కు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పలు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు బ్యాంకు చైర్మన్ ఎమిరిటస్ మానం ఆంజనేయులు, చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు లు పేర్కొన్నారు. మంగళవారం బ్యాంకు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం తమ బ్యాంకు 104 వ సంవత్సరంలో పయనిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 46, తెలంగాణ రాష్ట్రంలో నాలుగు బ్రాంచీలు తో మొత్తం 50 బ్రాంచీల తో బహుళ రాష్ట్రాల్లో సహకార అర్బన్ బ్యాంకు కార్యకలాపాలు నిర్వహిస్తోందన్నారు. 2018- 19 సంవత్సరాల నాటికి 5249.52 కోట్ల వ్యాపారాన్ని చేసిందన్నారు. ఖాతాదారులకు మెరుగైన సంక్షేమ పథకాలను కూడా అందుబాటులో ఉంచామన్నారు. బ్యాంకు అందిస్తున్న సేవల్లో సేవింగ్ బ్యాంక్ ఖాతాలపై 6 శాతం వడ్డీ, ఇంటి నిర్మాణం, రిపేర్లు, మోటార్ వాహనాల కొనుగోలు, వివాహాలకు, పిల్లల చదువులకు తదితర కార్యక్రమాలకు రుణాలను మంజూరు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం తమ బ్యాంకు లాభాల బాటలో పయనిస్తూ ఖాతాదారులకు అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. భారత్ బిల్ పేమెంట్ సిస్టం ను ప్రవేశపెట్టి కరెంట్ బిల్లులు, ఫోన్ బిల్లులు, గ్యాస్ బిల్లులు, ఇంటిపనులు తదితర బిల్లులను తమ బ్యాంక్ బ్రాంచ్ లో చెల్లించి సదుపాయం కూడా కల్పించామన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు ప్రతినిధులు గుడివాడ భాస్కర్ రావు, రాఘవ రావు, వెంకట జగ్గారావు, భవాని, పద్మావతి, నాగభూషణం చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

# ఉపకార వేతనాలు బహూకరణ

**విద్యార్థులను అభినందించిన వీసీ ప్రసాద రెడ్డి**



ఆంధ్రవిశ్వకళాపరిషత్: ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యా విభాగంలో ప్రత్యేక విద్య(స్పెషల్ ఎడ్యుకేషన్) చదువుతున్న విద్యార్థులకు కాగ్నిజెంట్ ఫౌండేషన్ మెరిట్ స్కాలర్‌షిప్‌లను ప్రకటించింది. వీటిని మంగళవారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆచార్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ, ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ కాగ్నిజెంట్ ఫౌండేషన్ మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందించడం మంచి పరిణామమన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య గార లచ్చన్న, అకడమిక్ డీన్ ఆచార్య కె.వెంకట రావు, అధ్యాపకులు డాక్టర్ కె.రాము, ఎం.వి.ఎస్.ఎస్ ప్రకాశ రావు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా కాగితాలమ్మవారి జాతర

అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్థానిక శివారున గల కొత్తపేటలో వెలసిన శ్రీశ్రీశ్రీ కాగితాలమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది.మంగళవారం ఉదయం 6 గంటల నుండి అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు తరలివచ్చారు.మహిళలు అమ్మవారికి సారె,చీర, నైవేద్యములు తమ శక్తి కొలది సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు.అమ్మవారిని ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే పర్వత.పూర్ణచంద్ర ప్రసాద్ దర్శించుకున్నారు.భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా కమిటీ వారు తగిన ఏర్పాట్లు చేసారు.సాయంత్రం 4 గంటల నుండి జాతర మహోత్సవంలో భాగంగా గెరగ నృత్యాలు, విచిత్ర వేషధారణలు,సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా అమ్మవారి జాతర జరిగింది. ఈ కార్యక్రమంలో ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఎస్సై మురళీమోహన్ తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు.



*విశాఖ దొండపర్తి బజార్‌లో 15వ వార్డు అధ్యక్షులు ఏర్పాటు చేసిన 54 అడుగుల వినాయక స్వామి వారిని దర్శించుకున్న డాక్టర్ విజయ ప్రసాద్ మళ్ళ, మాజీ ఎమ్మెల్యే, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఇన్ ఛార్జ్*

# మధురవాడ లో వైభవంగా విశ్వకర్మ జయంతి



మధురవాడ : మహా విశాఖ ఐదవ వార్డు పరిధిలో విశ్వకర్మ కార్పెంటర్ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా విశ్వకర్మ జయంతి మహోత్సవాలు నిర్వహించారు, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి వృత్తులు చేసుకుంటూ తమ కష్టం మీద బతుకుతూ అందరి మన్ననలు పొందుతూ ఐకమత్యంతో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు అలాగే ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ప్రముఖులను సత్కరించారు కార్యక్రమంలో కార్పొరేటర్ జగ్గు పల్లి అప్పలరాజు, పిల్లా కృష్ణమూర్తి పాతుడు, సంఘం అధ్యక్షులు గిడిజాల పార్వతీశం, సభ్యులు గోవింద్, మండ రమేష్, వీరాచారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



*శ్రీ శ్రీ సాయి సరిగమప లలితకళా తోరణం కార్యక్రమాలలో భాగంగా స్థానిక సాంఘిక సంక్షేమ బాలురు వసతి గృహం సీతమ్మ ధారలో విద్యార్థులకు లలిత కళలు. ..భిన్నత్వంతో ఏకత్వం....భారతీయ సంస్కృతీ సాంప్రదాయ గొప్పతనం. ..ద్యానమ్. ...మ్యూజిక్ థెరపీ.... మొదలగునవీ సవివరంగా వివరించటం జరిగిందని శ్రీ సాయి సరిగమప వ్యవస్థ పక అధ్యక్షురాలు హర్ష వల్లి తెలియజేసారు. కార్యక్రమం నిర్వాహణకు మాకు పూర్తి సహాయ సహకారాలను అందించినా వార్డెన్ నాయుడుకి . ..సరిగమప సభ్యులు, పి.వి.రమణమ్మకి. లక్ష్మికీ హృదయ పూర్వక ధన్యవాదములు మనసారా తెలుపుతూన్నమని హర్షం తెలియజేసారు.*



***విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ 15, 31, 44వ వార్డు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం. కార్యక్రమంలో 15వ వార్డు అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణ రెడ్డి, 31వ వార్డు నాగేంద్ర, లక్ష్మి శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.***



***విశాఖ పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం 45వ వార్డు గ్రామ వాలంటీర్లను అభినందించి వారికి గుర్తింపు కార్డులు అందజేసిన డాక్టర్ విజయ ప్రసాద్ మళ్ళ Ex-MLA విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఇన్ ఛార్జ్***

# విజయభాను సంపాదకీయం

## దేశంలో బహుళభాషాతత్వం

మోదీ ప్రభుత్వం కేంద్రంలో రెండవసారి ఏర్పడిన తర్వాత బీజేపీ పెద్దలు దేశ భిన్నత్వానికి, సమైక్యతకు దోహదపడే ఏ అంశాన్ని వదలదలుచుకున్నట్టు లేదు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా హిందీ దివస్ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఆయన భారత దేశ భిన్నత్వాన్ని గుర్తిస్తున్నట్టు మాట్లాడుతూనే, హిందీ భాష రూపంలో ఆధిపత్యాన్ని రుద్దే ప్రతిపాదనలు చేయడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. భారత్ భిన్నభాషల దేశం. ప్రతి భాషకు సొంత ప్రాముఖ్యం ఉన్నది. కానీ ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు గుర్తింపు తెచ్చే ఒకే భాష దేశానికంతటికీ ఉండటం ప్రధానం అని ఆయన అన్నారు. ఆ తర్వాత ఆయన మొత్తం ఇంగ్లిష్‌కు వ్యతిరేకంగా మాట్లాడారు. అమిత్ షా పైకి ఇంగ్లిష్ భాషకు వ్యతిరేకంగా మాట్లాడినట్టు కనిపించినా ఆయన లక్ష్యం దేశంలోని మిగతా ప్రాంతీయ భాషలు అనేది స్పష్టం. అందుకే దక్షిణాది, ఈశా న్య రాష్ట్రాల నుంచి నిరసనలు వ్యక్తమయ్యాయి. తమిళనాడులోని డీఎంకేతో పాటు బీజేపీ మిత్రపక్షాలు కూడా అమిత్ షా ప్రకటన పట్ల ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. దక్షిణాది రాష్ట్రాలపై హిందీని రుద్దలేరని డీఎంకే అధినేత స్టాలిన్ హెచ్చరించారు. భాష పేరుతో సంఘ పరివార్ కొత్త యుద్ధ క్షేత్రాన్ని నెలకొల్పుతున్నదని కేరళ ముఖ్యమంత్రి, వామపక్ష నేత విజయన్ విమర్శించారు. ఇతరులపై ఏ భాషను రుద్దలేరని జేడీఎస్ నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి స్పష్టం చేశారు. పుదుచ్చేరి ముఖ్యమంత్రి నారాయణ సామి కూడా నిరసన గళం వినిపించారు. అస్సాంలోని మేధావులు, సాహితీవేత్తలు అమిత్ షా వ్యాఖ్యల పట్ల తీవ్రంగా స్పందించారు. ఈశాన్యంలోని తెగలు ఐక్యంగా నిరసన తెలుపాలనే అభిప్రాయం వ్యక్తమైంది. త్రిభాషా సూత్రాన్ని పక్క నపెడుతున్న సూచనలేవీ ఇవ్వకూడదని కాంగ్రె స్ పార్టీ హితవు చెప్పింది. హిందీ అంటే ఎవరికి వ్యతిరేకత లేదు. భాష ముసుగులో వచ్చే ఆధిపత్యాన్ని చూసే మిగతా ప్రాంతాల వారు భయపడుతున్నారు. సిద్ధాంత రీత్యా బహుళత్వాన్ని అంగీకరించని రాజకీయపక్షంగా బీజేపీకి పేరున్నది. సొంత మెజారిటీతో రెండవ పర్యాయం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ నాయకత్వం దేశ సమాఖ్య తత్వాన్ని దెబ్బతీసి కేంద్రీకృత వ్యవస్థలను నెలకొల్పుతున్నదనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇంగ్లిష్ స్థానంలో హిందీ ఉండాలనేదే అమిత్ షా లక్ష్యమైతే, అది ఆచరణ సాధ్యమా? ఆచరణ సాధ్యం చేసేందుకు అమిత్ షా ఏమి చేయదలుచుకున్నారు అనేది వివరించాల్సింది. దేశ సరిహద్దులు దాటి ప్రజలు ఉన్నత అవకాశాలు వెదుక్కుంటున్న కాలమిది. ఇంగ్లిష్ పరిజ్ఞానం లేకపోతే యువత పరిస్థితి ఎట్లా ఉంటుందో ఊహకు అందని విషయం కాదు. సాఫ్ట్‌వేర్‌రంగం ఒక్కటి తీసుకున్నా ఇంగ్లి ష్ లేకుండా భవిష్యత్ ఉండదు. కృత్రిమ మేధ, రోబోటిక్స్, నానో టెక్నాలజీ, జెనెటిక్స్, త్రీడీ ప్రింటింగ్ వంటి అనేకరంగాలలో విస్తృతంగా కొత్త ఆవిష్కరణలు వచ్చిపడుతున్నాయి. ఈ విజ్ఞానమంతా ఇంగ్లిష్ వచ్చిన వారికే దక్కుతుంది. హిందీ మాత్రమే ఉండాలని గిరిగీసుకొని బతుకలేం. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అభివృద్ధిలో తేడా ఉండటానికి ఇంగ్లిష్ భాషా పరిజ్ఞానం, లౌకిక భావజాలం ప్రధాన కారణాలు కాదా! అమిత్ షా హిందీ దివస్ సందర్భంగా ఆ భాషను ఎట్లా అభివృద్ధి చేయదలుచుకున్నారో వివరిస్తే బాగుండేది. ప్రపంచంలోని అన్ని వైజ్ఞానిక రంగాలలో వస్తున్న తాజా పరిజ్ఞానాన్ని హిందీలో చదువుకు నేవిధంగా ఆ భాషను అభివృద్ధి చేయదలుచుకుంటే అదే విషయాన్ని వివరించవచ్చు. కానీ అటువంటి ఆచరణ సాధ్యం కాని లక్ష్యం అమిత్‌షాకు ఉన్నట్టు కనిపించడం లేదు. అందువల్ల ఆయన లక్ష్యం హిందీ భాష పేర ఆధిపత్యాన్ని రుద్దడమేనని అనుకోవడానికి ఆస్కారం కలుగుతున్నది. గాంధీ ఆశయాలకు అనుగుణంగా హిందీని ఉద్ధరిస్తున్నట్టు కూడా అమిత్ షా చెబుతున్నారు. కానీ గాంధీ ప్రజలకు తన భావాలను చేర్చడం కోసం హిందుస్థానీలో మాట్లాడేవారు. గాంధీ ఆశయాలపై అంత నిబద్ధతే ఉంటే సత్యం, అహింస, స్వావలంబన వంటి సూత్రాలను ఆచరణలో పెట్టవచ్చు. గాంధీని గౌరవించడానికి భాష ఒక్కటే దొరికిందా! రాజ్యాంగసభలోనే అధికార భాష, జాతీయ భాష మొదలైన అంశాలపై కూలంకష చర్చ సాగింది. హిందుస్థానీ, హిందీ, సంస్కృతం మొదలైన భాషలు, లిపులు చర్చకు వచ్చాయి. దక్షిణాది అభ్యంతరాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. అన్ని చర్చించిన తర్వాతనే హిందీని అధికార భాషగా గుర్తించారు. కానీ జాతీయభాషగా చేయలేదు. అధికార భాషగా హిందీతోపాటు ఇంగ్లిష్‌ను చేర్చక తప్పలేదు. ఆ తర్వాత 1960 దశకంలో హిందీయేతర ప్రాంతాల వారు కోరుకున్నంతకాలం ఇంగ్లిష్ కొనసాగుతుందని స్పష్టం చేయవలసి వచ్చింది. 22 భాషలను రాజ్యాంగంలోని 8వ షెడ్యూలులో చేరుస్తూ వచ్చారు. ఈ సంఖ్య ఇంకా పెరుగవచ్చు. ఈ విధంగా దేశంలోని బహుళత్వాన్ని గుర్తించకతప్పలేదు. దేశవ్యాప్తంగా మిగతా భాషలతో పోలిస్తే ఎక్కువమంది వ్యవహారం నడిపేది హిందీలోనే.



***జాతిపిత మహాత్మా గాంధీ 150వ జయంతి సందర్భంగా ఒకరోజు ముందుగా స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ ఆధ్వర్యంలో వైయస్సార్ సెంట్రల్ పార్క్ వద్ద జండా ఊంచా రహే హమారా 25 వేల చదరపు అడుగుల త్రివర్ణ పతాక ప్రదర్శన పదివేల మంది విద్యార్థులతో నిర్వహించబోతున్నారు దీనికి సంబంధించిన బ్రోచర్ను ఆవిష్కరించిన డాక్టర్ : విజయ ప్రసాద్ మళ్ళ Ex-MLA విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఇన్ ఛార్జ్.***

## 21న డిడిఓల సదస్సు

శ్రీకాకుళం : జిల్లా ఖజానా కార్యాలయ పరిధిలోని శాఖాధిపతులతో ( డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లు - డి.డి.ఓ ) ఈ నెల 21న అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు జిల్లా ఖజానా శాఖ ఉప సంచాలకులు జి.నిర్మలమ్మ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసారు. 2019 -20 ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖాధిపతులు తమ శాఖాపరమైన ఖర్చులు ఏపద్దులు క్రింద ఏవిధంగా ఖర్చు చేయవలెనో తెలియజేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు సంఖ్య 69,99 మరియు 101, తే14.08.2019దీ ద్వారా తెలిపియున్నారని, వాటిపై అవగాహన నిమిత్తం సెప్టెంబర్ 21న స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30గం.లకు సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.

## సత్యదేవ జూనియర్ కళాశాలలో ఆయుస్మాన్ భారత్




అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం శ్రీ సత్యదేవ జూనియర్ కళాశాలలో ఆయుష్మాన్ భారత్ పక్షోత్సవాలు సందర్భంగా కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.రవికుమార్ ఆరోగ్యం పట్ల విద్యార్థులు పాటిం చవలసిన విషయాలను వివరించారు. అదేవిధంగా కళాశాల ప్రిన్సిపల్ గిరి మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యం అన్న విషయమును ప్రతీ ఒక్కరు పాటించాలని తెలిపారు.బాటనీ లెక్చరర్ గంటసాల.వెంకట్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు వ్యాయామం చేసి,సమతుల్య ఆహారము తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమం యన్.యస్.యస ప్రోగ్రామ్ ఆఫీసర్ గంటసాల. వెంకట్, మాణిక్యాంబ ఆద్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమం లో యన్.యస్.యస విద్యార్థులు, లెక్చరర్స్, ఆశావర్కర్స్,హీల్స్ వర్కర్స్,వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతివర్దన స్కూలునందు ఘనంగా ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు



అన్నవరం.... తూ.గో.జిల్లా అన్నవరంలో ప్రధాని శ్రీ నరేంద్రమోదీ గారి పుట్టినరోజు సందర్భంగా తొండంగి మండలం లోని బెండపూడి లోగల శాంతివర్ధన దివ్యంగుల స్కూల్ లో బిజెపి నాయకులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి దివ్యంగులకు కేకులు,స్వీట్స్, బిస్కట్స్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసనమోర్చా జాతీయ కార్యదర్శి శ్రీ సత్య కృష్ణంరాజు కట్ చేసి దివ్యంగుల లకు తినిపించారు.వారితో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిరంజీవి కామర్సు, బిజెపి మండల నాయకులు యాదల రమణ, చిట్ర శ్రీను,బిల్లా,పంపరాజు,కటకం శ్రీను,కె శ్రీను.ఇంకా అనేకమంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెయిన్ రోడ్డు నందు మద్యం షాపులు వద్దంటూ మహిళలు ఆందోళన



అన్నవరం ...తూ.గో.జిల్లా అన్నవరం మెయిన్ రోడ్ నందు ఆంధ్రాబ్యాంక్ వద్ద నిర్వహిస్తున్న బ్రాందీ షాపును తిరిగి ప్రభుత్వ నిర్వాహణలో షాపుగా తీసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పర్వతను గ్రామస్తులు కోరారు. గ్రామంలో జరిగే పలు అన్న సమారాధనలుకు , ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే పర్వతను ఆ ప్రాంతంలో గల మహిళలు చుట్టుముట్టి తమ సమస్యను తెలిపారు.

ఇక్కడ సుమారు 150 కుటుంబాల వారు నివసిస్తున్నారని,చౌరస్తా ఎప్పుడూ ట్రాఫిక్ తో రద్దీగా అదే కాకుండా దేవుడు ఊరేగింపుగా తిరిగే ప్రధాన వీధి అయినందున చాలా ఇబ్బందులు పడుతున్నామని తమ ఆవేదన వెలిబుచ్చారు.వాళ్ళ సమస్యను సావధానంగా విన్న ఎమ్మెల్యే పర్వత అప్పటికప్పుడు అబార్కీ అధికారులతో మాట్లాడి ఈ షాపును వేరే చోటకు మళ్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇక్కడి ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆ దిశగా తగిన ప్రదేశం నిర్ణయించుకోవాలని ఆదేశించారు.

## వైభవంగా శాంతి నగర్ వినాయకుని అనుపు



అనకాపల్లి ... పట్టణంలో గవరపాలెం శాంతినగర్‌లో గల వినాయకుని అనుపోత్సవం వైభవంగా జరిగింది. మేళ తాళాలు బాణాసంచా పేలుళ్ల సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అనుపోత్సవాన్ని నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు దాడి జయవీర్ ముందుగా గణపతికి పూజలు నిర్వహించి అనంతరం ఊరేగింపును ప్రారంభించారు. పురవీధుల గుండా స్వామివారిని ఊరేగించారు. భక్తులు దర్శించుకుని తరించారు. ముందుగా ఆలయం వద్ద పలు పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్ యూత్ సభ్యులు, బుద్ధ మోహన్, దొడ్డి చంద్ర, బుద్ధ చినఅప్పలనాయుడు, బుద్ధ అప్పలనాయుడు, పెంటకోట సంతోష్, పెంటకోట సురేష్, బుద్ధ నాగేశ్వరరావు, కొణతాల రామకృష్ణ, కొణతాల నానీ, కర్రి రామశివ, మద్దాల వెంకటప్పారావు, బొడ్డేడ రాము, స్థానిక యువకులు, మహిళలు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపీ సత్యవతికి మరో అరుదైన గౌరవం



అనకాపల్లి . అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ సత్యవతికి వరుసుగా పదవులు వచ్చివరిస్తున్నాయి. గడచిన ఎన్నికలలో అనూహ్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ పార్లమెంట్ సీటును పొంది ఘనవిజయం సాధించారు. అనంతరం బొగ్గు, స్టీలు, స్టాండింగ్ కమిటీలో సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం హామీకి వీటిని కేటాయించింది. ఇప్పుడు నూతనంగా మంగళవారం జిల్లా టెలీఫోన్ సలహాసంఘం సభ్యురాలిగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. పార్లమెంట్‌లో అనర్గలమైన ప్రసంగాలతో ప్రజలను ఆకట్టుకుంటున్న సత్యవతి సేవలను వినియోగించుకునేందుకు వీలుగా జిల్లా టెలిఫోన్ సలహా సంఘం సభ్యురాలిగా నియమించడం హర్షనీయమని పార్టీ నాయకులు, కార్యకర్తలు, హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో బాధ్యతలు స్వీకరించ -నున్నారు.

## ఏపిఐఐసి చైర్మన్ ఆర్ కె రోజాను కలిసిన మత్స్యకార నాయకులు



అచ్యుతాపురం : బ్రాండిక్స్ ను సందర్శించిన ఏపిఐఐసి చైర్మన్ ఆర్ కె రోజాను మంగళవారం మత్స్యకారుల సమస్యలపై పూడిమడక మత్స్యకార నాయకులు కలిసి వినతిపత్రం అంద జేశారు.

పూడిమడక మత్స్యకారుల బ్రాండిక్స్ పెండింగ్ ప్యాకేజీ , ఏపిఐఐసి పైప్ లైన్ ప్యాకేజీ సమస్యలపై ఆమెకు వివరించినట్లు మత్స్యకార నాయకులు, వైఎస్ఆర్ టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి చోడిపల్లి అప్పారావు , మేరుగు అప్పలనాయుడు తెలిపారు.

## ఘనంగా మోడీ జన్మదిన వేడుకలు




అనకాపల్లి .... భారత ప్రదాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జిల్లా బిజేపీ ప్రదాన కార్యదర్శి కొణతాల అప్పలరాజు నేతృత్వంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసారు. ముఖ్య అతిధిగా జిల్లా పార్టీ అధ్యక్షులు పొన్నగంటి అప్పారావు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థిని, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసారు. అనంతరం వారు మాట్లాడుతూ గడచిన ఆరేళ్లలో భారతదేశాన్ని అభివృద్ధి పదంవైపు నడిపించిన ఘనత మోడీకే దక్కుతుందన్నారు. ఏ ప్రదాని చేయని, సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని, ప్రపంచ దేశాలలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రదాన కార్యదర్శి కశిరెడ్డి శ్రీనివాసరావు, బొడ్డేడ నరేష్, ఆడారి రవి, ఎం. నాయుడు, పీలా రమేష్, కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరో వార్డులో మోదీ 69వ జన్మదిన వేడుకలు



విశాఖపట్నం : విశాలాక్షినగర్ ఏరియాలోని ఆరో వార్డు లో మోదీ 69వ జన్మదినం ఘనంగా నిర్వహించారు పార్టీ నాయకులు సన్ మూర్తి మిలటరీ శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించి కేకు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా సన్ మూర్తి మాట్లాడుతూ దేశానికి దిశానిర్దేశం చేస్తూ అనేక కీలక అంశాలపై నిర్ణయం తీసుకున్నట్టు వంటి మహోన్నత నేత ప్రధాని నరేంద్ర మోడీ అని, దేశాన్ని ఒక ఉన్నత స్థాయికి తీసుకు వెళుతున్న టువంటి దీరుడు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. నరేంద్ర మోడీ చేసిన ప్రతి పని ఒక సంచలన నిర్ణయం అని, సర్జికల్ స్ట్రైక్, నోట్ల రద్దు, ఆర్టికల్ 370 వంటి కీలక అంశాలపై చారిత్రాత్మకమైన నిర్ణయాలు చేసి వారు దేశ చరిత్రలో ఒక మంచి ప్రధానిగా నిలిచారని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. స్వచ్ భారత్ నినాదం ఈ దేశానికి మంచి శుభాన్ని చేకూర్చింది అన్నారు. కార్యక్రమంలో బి సతీష్, ఉమాదేవి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు

## గోదావరి బోటు ప్రమాద మృతులకు నివాళి



అచ్యుతాపురం : పాపికొండల్లో గోదావరి బోటు ప్రమాదంలో మృతి చెందిన వారికి మండల కేంద్రమైన అచ్యుతాపురంలో మంగళవారం సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము , డివైఎఫ్ఐ ఉపాధ్యక్షులు కె సోమునాయుడు , ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఆర్ మాధవి ,ప్రజాసంఘా నాయకులు కొవొత్తులతో నివాళులర్పించారు .



*ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ మరణానికి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న కక్ష రాజకీయాలే కారణమని, మంగళవారం అనకాపల్లి తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, కాగడాల ప్రదర్సన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, టీడీపీ నాయకులు డాక్టర్ నారాయణరావు, కొణతాల వెంకటరావు, మళ్ల సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.*

## మోడీ జన్మదినం సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం




పెందుర్తి : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకొని పెందుర్తి మండలం చిన్నముసిడివాడ సమీపంలోనున్న శ్రమ శక్తి నగర్ కాలనీలో పెందుర్తి నియోజకవర్గం బిజెపి పార్టీ కన్వీనర్ కొన మంగయ్య నాయుడు ఆధ్వర్యంలో రోటరీ నేత్ర వైద్యులచే ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మల్సీ పీవీఎన్ మాధవ్ ప్రారంభించారు. సమాజంలో చాలా మంది ప్రజలు అవగాహన లోపం కారణంగా దృష్టి లోపాలకు గురవు తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ నేత్ర వైద్యులు డాక్టర్ శ ృతి, అలేఖ్య కరుణ పార్వతి బిజెపి నాయకులు 70 వార్డ్ బిజెపి అధ్యక్షులు భరద్వాజ్, బాల సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM.
I.A.No.57 OF 2019 IN O.S.No.92 of 2014

Between:
Manikala Rama Rao ...Petitioner/Plaintiff
And:
Tippa Rangayya ...Respondent/Defendant.

**Respondent:**
**Sri.Tippa Rangayya, S/o.late Kotayya, Hindu, aged about 55 years, residing at Flat No.22, Eenadu Lay Out, Sagar Nagar, Visakhapatnam.**

**NOTICE**

Please take notice that the above I.A. was filed by the Petitioner against you for passing a final decree in terms of the preliminary decree in O.S.92/2014 Dated 31.07.2018 in favour of the Petitioner/Plaintiff. The same was stands posted to **14.10.2019** for your appearance at **10.30 A.M.,** before the above said Court and if you want to contest the matter you may do so either in person or by a duly instructed pleader, failing which the matter will be decided in your absence as per law.

**(BY ORDER OF THE HONOURABLE COURT)**
**N.S.V.REDDY**
**BHAMIDIPATI RAMESH BABU**
**PALAVALASA RAM BABU**
**Advocates**
**D.No.49-36-47,**
**Venumadhavi villa,**
**N.G.O's Colony, Akkayyapalem**
**Visakhapatnam-530016.**
**Phone No: 9393102036,**
**9848202060 & 9849234984.**

**మార్కుల లిస్టు, పాస్‌పోర్టు పడిపోయినది**

కర్రి హరీష్ రెడ్డి,
S/o. కర్రి సూర్యానారాయణరెడ్డి
అను నేను సెప్టెంబర్ 10వ తేదీన రైల్వే స్టేషన్ నుండి అక్కయ్యపాలెంలో గల ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో 10వ తరగతి మార్కుల లిస్టు, పాస్‌పోర్టు పడిపోయినది.
పాస్‌పోర్ట్ నెం: H 1864197
దొరికిన వారు క్రింది అడ్రస్‌కు తెలియజేయవలెను.

కర్రి హరీష్ రెడ్డి,
S/o. కర్రి సూర్యానారాయణ రెడ్డి
డోర్ నెం. 49-40-3, ఫ్లాట్ నెం. 201
గౌతమ నిలయం; ఎన్‌జిజిఓస్ కాలనీ,
అక్కయ్యపాలెం, విశాఖపట్నం.
సెల్ : 70361 71223

**CHANGE OF NAME**

I, PATNALA SREENIVASA RAO
S/O PATNALA NAGA RAJU
Residing at Door No. 3-117,
Narava, Pendurthi
VISAKHAPATNAM, AP
Changed my old name
PATNALA SREENIVASA RAO
to New name
PATNALA SRINIVASA RAO
I request all to consider my name
PATNALA SRINIVASA RAO
S/O PATNALA NAGA RAJU

## గోదావరి బోటు ప్రమాద మృతుల కుటుంబాలకు మల్లాడి రాజేంద్రప్రసాద్ ప్రగాఢ సానుభూతి

యానాం : బోటు సరంగులు సంగాడి నూకరాజు మరియు పోతాబత్తుల సత్యనారాయణ మృతికి మల్లాడి రామారావు ఛారిటబుల్ ట్రస్టు, వ్యవస్థాపక అధ్యక్షులు మల్లాడి రాజేంద్ర ప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు. ముత్తానగర్ వాస్తవ్యుడు సంగాడి నూకరాజు జగన్నాధపురం వాసి. పోతాబత్తుల సత్యనారాయణల కుటుంబాలకు తమ ట్రస్టు తరపున సహాయం చేసి, అదు కుంటామని మల్లాడి తెలిపారు.

సంగాడి నూకరాజు పిల్లలను తమ ట్రస్టు ద్వారా చదివించదల చామని, పోతాబత్తుల సత్యనారాయణ పిల్లలు వివాహితులు కనుక ఆయన భార్యకు సహాయం అందిస్తామని రాజేంద్ర తెలిపారు. గోదావరి బోటు ప్రమాద మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

## అనంతగిరి, వెలగలపాడు గ్రామానికి త్రాగునీరు సౌకర్యం కల్పించాలి



బురద నీరు త్రాగుతున్న వెలగలపాడు గ్రామ ప్రజలు

అనంతగిరి : మండలం లొంగుపర్తి పంచాయితీ పరిధిలో గల వెలగల పాడు గ్రామానికి సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు కిల్లో సురేంద్ర అనంతగిరి మండల సిపిఎం పార్టీ నాయకులు ఎస్ కొండల రావు వెలగల పాడు గ్రామంలో పర్యటించి గ్రామంలో తాగ డానికి మంచి నీరు లేక బురద నీరుతాగి ప్రజలు అనా రోగ్యానికి గురిఅవుతున్నారని, ఆర్డబ్ల్యూఎస్, మండలాభివృద్ధి అధికారులు స్పందించి వెంటనే గిరిజన ప్రజలను మంచినీరు ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేశారు.



అనంతగిరి వాలంటీర్లకు ఒకరోజు ట్రైనింగు ప్రోగ్రాం లో ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసన సభ్యులు చెట్టి ఫాల్గుణ బొకే ఇచ్చి ఆహ్వానం పలుకతున్న అరకులోయ గృహ నిర్మాణ శాఖ డిఇఇ బాబు

# 19న యువకళా ప్రతిభా పురస్కార ప్రదానం



విశాఖపట్నం : కొసనా కల్చరల్ అకాడమీ ఆధ్వ ర్యంలో ఈనెల 19న స్థానిక పౌర గ్రంథాలయంలో వివిధ కళా ప్రక్రియలలో ప్రసిద్ధులయిన 11మందికి యువకళా ప్రతిభా పురస్కార ప్రదానం గావిస్తున్నట్లు, ఆనాటి ముఖ్య అతిథి వీఎంఆర్‌డిఎ ఛైర్మన్‌చే పురస్కార ప్రదానం గావిస్తున్నట్లు, అకాడమీ అధ్యక్షురాలు సుసర్ల శేషమణి తెలియజేశారు. ఆ కార్యక్రమ గోడ పత్రికను ద్రోణంరాజు శ్రీనివాస్ ఆవిష్కరించినట్లు తెలియజేశారు. చిత్రంలో శేషమణి, ద్రోణంరాజు శ్రీనివాస్, కొసనా, అకాడమీ కన్వీనర్ నేమాని త్రిపురసుందరి ఉన్నారు.

# కోడెల శివప్రసాదరావు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తూ ర్యాలీ




గోపాలపట్నంలో కీ.శే. కోడెల శివప్రసాదరావు చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు మరియు నియోజకవర్గ నాయకులు

గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గం కార్యక్రమం నందు విశాఖ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు గణబాబు ఏర్పాటు చేసిన సమన్వయకర్తల సమావేశంనందు గణబాబు మాట్లాడుతూ కోడెల శివప్రసాద్‌ది ముమ్మాటికి రాజకీయ హత్య అని అన్నారు. వైస్సార్ ప్రభుత్వం వచ్చిన దగ్గరనుండి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నరు అని అన్నారు. కోడెల శివప్రసాద్ ఆత్మహత్య చేసుకున్న అంతే పిరికివాడు కాదు తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించినప్పటి నుండి వివిద శాఖలో మంత్రిగా పని చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత నవ్యాంధ్ర తొలి స్పీకర్‌గా నిర్వహించారు అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు తో నిరసన ర్యాలీ నిర్వహించారు. రాజమహేంద్రవరం లో జరిగిన పడవ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు.ప్రభుత్వ అన్ని విధములుగా ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం నందు నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చోడవరంలో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద విశ్వకర్మకు పూజలు చేస్తున్న కామాక్షమ్మ కార్పెంటర్ల సంక్షేమ సంఘం సభ్యులు



పెదబజారువీధిలో విశ్వకర్మకు పూజలు చేస్తున్న స్వర్ణకారుల సంఘం సభ్యులు

చోడవరం : ఆది కార్మికుడు విశ్వకర్మ, పంచకర్మల సృష్టికర్త పనిముట్లు సృష్టించిన మహనీయుడు విశ్వకర్మ జయంతి వేడుకలు చోడవరం పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చీడికాడ రోడ్డు దుడ్డువీధిలో గల శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో కామాక్షమ్మ కార్పెంటర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి అనంతరం కోళాటాల ప్రదర్శనతో ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పెంటర్ల సంఘం అధ్యక్షులు పట్నాల బ్రహ్మానందం, సెక్రటరీ గంగుల గుత్తి ప్రసాదరావు, ద్వారపూడి సత్యారావు,మధుపాక అప్పారావు, ద్వారపూడి శంకర్‌రావు, కొచ్చెర్ల ప్రకాష్‌రావు, అర్చకులు కోనేటి బ్రహ్మానందం సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పెదబజారువీధిలో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. 5 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. గౌరవ అధ్యక్షులు వరదా వెంకట సత్య నారాయణ, అధ్యక్షులు పట్నాల జగదీశ్వరరావు, సెక్రటరీ కోనేటి రాజు, బల్లంకి శివ, తామరపల్లి మణికంత, పట్నాల నగేష్, డొంకా ఆఛారీ, వీరమళ్ల చెన్నయ్య, కొమ్మోజు నరసింహమూర్తి, చప్పా బ్రహ్మాజీ, సతీష్, సోలంకి నితిన్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అచ్యుతాపురంలో ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



అచ్యుతాపురం : స్థానిక బీజేపీ కార్యాలయంలో బీజేపీ యల మంచిలి నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్య క్రమంలో బిజెపి నాయకులు రాజాన రాజు, మేరుగు కాసు బాబు, పల్లి రాజబాబు, దేశంశెట్టి కాసుబాబు, తిమ్మపాత్రుని గోవిందరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 18 నుంచి 25 వరకు రైతు భరోసా గ్రామసభలు

కోటవురట్ల : మండల వ్యాప్తంగా ఈ నెల 18 నుండి 25 వరకూ గ్రామాల్లో గ్రామసభ నిర్వహించి రైతు భరోసాకు అర్హులైన రైతులను గుర్తిస్తామని కోటవురట్ల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. మంగళవారం తహశీల్దార్ రామారావు నేతృత్వరంలో ఈ విషయమై సమావేశం జరిగింది. ఈ నెల 18న సుంకపూర్, రాజుపేట, 19న పందూరు, అన్నవరం, 20న బికెపల్లి, గొట్టువాడ, 21న పికె.పల్లి, జగ్గంపేట, 23న కొడవటిపూడి, బోడపాలెం, 24న చినబడ్డేపల్లి, పాములవాక, 25న కోటవురట్ల తంగేడు గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి 1 గంటల వరకూ రైతు భరోసా గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

## ప్లాస్టిక్‌ను నిషేధించాలని మానవహారం



కోటవురట్ల : ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్ధాలను తెలుసుకొని వాటిని వాడకూడదని కోటవురట్ల మండల ప్రత్యేకాధికారి అనురాధ అన్నారు. అన్నారు. మంగళవారం ప్లాస్టిక్ నిషేదంపై విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడలిలో మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన ఎన్నో అనార్ధలు ఉంటాయన్నారు. కావున ప్లాస్టిక్‌ను అంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సువర్ణరాజు, ఈఒపిఆర్‌డి కొండలరావు, పలువురు కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ స్పీకర్ కోడెలకు ఘన నివాళి

కోటవురట్ల : మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ మృతి తీరని లోటని టీడీపీ మండలాధ్యక్షులు లాలం కాశీనాయుడు అన్నారు. మంగళవారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కోడెల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కాశీనాయుడు మాట్లాడుతూ ఆయన ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎన్నో సార్లు ప్రజలకు సేవ చేశారన్నారు. ఈయన మరణం టీడీపీకి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేచలపు జనార్ధన్, పినపాత్రుని బాబ్జి, జానకిహరి తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడి రుణాల మంజూరుకు దరఖాస్తులు చేసుకోండి నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి

నర్సీపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు బిసి, కాపు, వైశ్య, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ కులం వారికి వ్యాపారరీత్యా సబ్సిడి రుణాలు మంజూరు నిమిత్తం ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కావున నర్సీపట్నం పురపాలక సంఘంలో ఉన్న అర్హత గల అభ్యర్థులు ఫొటో, ఆధార్ కార్డు, కులధృవీకరణ పత్రం, రేషన్ కార్డులతో www.apobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ ఆన్‌లైన్ దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయం లేదా, మెప్మా కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అదే విధంగా ఆటో, ట్యాక్సీ అభ్యర్థులకు ఆర్థిక చేయూత మంజూరు నిమిత్తం ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నర్సీపట్నం పురపాలక సంఘంలో ఉన్న సదరు అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కోడెలకు ఘన నివాళి



మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌కు నివాళులు అర్పిస్తున్న నాయకులు

నాతవరం : మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ సంతాపంగా మండల కేంద్రమైన నాతవరంలో మంగళవారం ఎన్టీఆర్ విగ్రహం వద్ద కోడెల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ కొత్తగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైయస్సార్ పార్టీ ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ ఒత్తిడి వల్లే కోడెల మృతి చెందారని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కరక సత్యనారాయణ, మాజీ ఎంపిపి శింగంపల్లి సన్యాసిదేముడు, వైస్ ఎంపిపి వీసం నూకరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లాలం అబ్బారావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు శెట్టి సత్యనారాయణ, ఆసుపత్రి కమిటీ చైర్మన్ కాశపు నూకరాజు, శెట్టిలోవ పాల్గొన్నారు.

# ఘనంగా ప్రధాన మోదీ 69వ జన్మదిన వేడుకలు

**స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న రాష్ట్ర గిరిజన మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మరియు కేంద్ర కాఫీబోర్డు మెంబర్ లోకుల గాంధీ**



కొయ్యూరు : ప్రధానమంత్రి 69వ జన్మదిన వేడుకల సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆర్&బి నుంచి కార్యాలయం వరకు కేజిబివి విద్యార్థినులు, జిటిడబ్ల్యూఏ విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొని శుభ్రపరిచారు. అనంతరం స్వచ్ఛభారతం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిధిగా గిరిజన మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు లోకుల గాంధీ హాజరయ్యారు. లోకుల గాంధీ మాట్లాడుతూ రైల్వే ఫ్లాట్‌ఫాంలో టీ అమ్ముకున్న వ్యక్తి భారత ప్రధాని అవడం, అందులో బడుగు వర్గానికి చెందిన వ్యక్తి ప్రధాన స్థాయికి చేరుకోవడం, ఆయన యొక్క పనితనం, నీతి నిజాయితీకి నిదర్శనమన్నారు. ప్రధాని మోదీ వల్ల ప్రపంచ సా&థయిలో భారతదేశానికి మంచి గుర్తింపుతో పాటు గౌరవం వచ్చిందన్నారు. మోదీ 69వ జన్మదినం యావత్ భారత్ వారోత్సవాలుగా జరుపుకుంటుందని, అందులో భాగంగా అనేక ప్రజాహిత కార్యక్రమాలు, స్వచ్ఛ భారత్‌తో పాటు మొక్కలు నాటడం, రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేయడం, ప్లాస్టిక్‌పై నిషేధంపై అవగాహన కల్పించడం వంటివి దేశమంతా సెప్టెంబర్ 14 నుంచి 20వతేదీ వరకు జరుగుతుందన్నారు.

మండల అధ్యక్షులు కూడ నూకరాజు, మురుకుర్తి అప్పలరాజు, కుర్రు నూకరాజు, శరభయ్య, గాలి దేముడు, అరిమెల రాజు మరియు అధిక సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




**మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా ఈ నెల 14వ తేదీ నుండి 20 వ తేదీ వరకు చేపట్టిన సేవా వారోత్సవాలలో భాగంగా మంగళవారం నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా భీమిలిలో ఉన్న వృద్ధ ఆశ్రమములో పండ్లు, దుప్పట్లు పంచడము జరిగింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజకుమారి విశాఖ నగర భారతీయ జనతా పార్టీ మహిళ మోర్చా లలిత కుమారి, సభ్యులు తదితరలు పాల్గొన్నారు.**

# ఏవియన్ కళాశాల ఎన్‌సిసి కేడిట్లతో స్వచ్ఛత ర్యాలీ




విశాఖపట్నం: 13 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ఆదేశాలు అనుసరించి బుధవారం మిస్సెస్ ఏవిఎన్.కళాశాల ఎన్‌సిసి క్యాడెట్స్ స్వచ్ఛత ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి.విజయప్రకాష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత పట్ల ప్రజలకు అవగాహన కలిగించడానికి ఈ ర్యాలీ దోహద పడుతుందని తెలియజేశారు. కళాశాల ఎన్‌సిసి అధికారి కెప్టెన్ డా.ఎన్.రామకృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ ర్యాలీలో దాదాపు 70మంది ఎన్‌సిసి క్యాడెట్స్ ఉన్నారు. ఈ ర్యాలీ ఏవిఎన్.కళాశాల వద్ద నుండి బయలుదేరి జాలారిపేట, వెలంపేట మీదుగా ఏవిఎన్.కళాశాల వద్ద ముగిసింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ...

ఈనెల 17వతేదీ నుండిఅక్టోబరు 2 వరకు స్వచ్ఛత పక్షోత్సవాలు జరుగుతాయని తెలియజేశారు.

# ఎస్‌అండ్‌టి అసోసియేట్స్ వుడా పార్క్‌లో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమం



విశాఖపట్నం: ప్రకృతి పరిరక్షణలో భాగంగా ఎస్‌అండ్‌టి అసోసియేట్స్ వారు మంగళవారం విఎం ఆర్‌డిఎ (వుడా) పార్క్‌లో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న డీఎస్‌ఆర్ సుజన, ఈ సందర్భంగా నాటిన మొక్కల ప్రత్యేకత గురించి ఎస్‌అండ్‌టి ప్రతినిధులు డిఎస్‌ఆర్ సుజన, కెఆర్‌ఎన్‌ఎస్ తేజ మాట్లాడుతూ మంగళవారం నాటిన మొక్క 'పిసోనియా గ్రాండిస్'ని పరిశోధనలో భాగంగా ప్రత్యేక పద్ధతిలో పెంచిన ఈ మొక్క ప్రకృతిలో ఉన్న కాలుష్య తీవ్రతని తగ్గించడములో ప్రధాన భూమిక పోషిస్తుందని, ప్రత్యేకంగా చుట్టూ కొండలతో నిండి వుండే విశాఖపట్నంలో ఇలాంటి మొక్కలు నాటుట ఎంతో ఆవశ్యకర మన్నారు. విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు, మెట్రో పాలిటన్ కమిషనర్ పి.కోటేశ్వరరావు, జివియంసి కమిషనర్ జి.సృజన, విశాఖ పట్నం పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి వర్మ, విశ్రాంత అడిషనల్ ఎస్‌పి టిఎస్‌ఆర్ ప్రసాద్, విఎం ఆర్‌డిఎ డిఎఫ్‌ఓ రాజారావు, రేంజ్ అధికారి

# ప్లాస్టిక్ రహిత మండలముగా పరవాడను తీర్చిదిద్దాము



**స్పెషల్ ఆఫీసర్ శ్రీనువాస్‌మూర్తి**

పరవాడ : ప్లాస్టిక్ రహిత మండలముగా పరవాడను తీర్చిదిద్దామనీ నియోజకవర్గ స్పెషల్ అఫీసర్ శ్రీనువాస్ మూర్తి పేర్కొన్నారు. స్వచ్ఛసేవలో భాగంగా మంగళవారము పరవాడ మండలములోని ముత్యాలమ్మ పాలెం, వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, పరవాడ, వెన్నలపాలెం తదితర గ్రామంలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ స్పెషల్ అపీసర్ శ్రీనువాస్‌మూర్తి హాజరయ్యారు. ర్యాలీలో భాగంగా ఇంటిఇంటికి వెళ్ళి ప్లాస్టిక్ వినియోగము వలన కలిగే నష్టాలును ప్రజలుకు వివరించారు. గ్రామాల్లో గల గుంటలు, మురికికాలువల్లో మందులను పిచికారి చేయించారు. పారిశుధ్యముపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కోరారు. అనంతరము వాడచీపురుపల్లి పంచాయితీ కార్యా లయంలో ప్లాస్టిక్ నిర్మూలనపై సదస్సును ఏర్పాటుచేసారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అపీసర్ శ్రీనువాస్ మూర్తి మాట్లడుతూ పరవాడ మండలాన్ని ప్లాస్టిక్ నిర్మూలన మండలముగా తీర్చిదిద్దాలనీకోరారు. పర్యా వరణానికి హానికలిగించే ప్లాస్టిక్ భూతాన్ని తరిమికోట్టేందుకువి ద్యార్థులు, మహిళలు నడుమ బిగించాలనీకోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టకపోతే రాబోయే రోజుల్లో లేనిపోనివ్యాదులును కోరి తెచ్చుకుంటామనీ తెలిపారు. ఈ కార్యక్రమంలోస్పెషల్ అపీసర్ కోటేశ్వరావు, పంచాయితీ విస్తరణాదికారి పద్మజ,వ్యవసాయ అదికారి చంద్రావతి, వైసిపి కన్వీనర్ బురదరాజు, పరవాడ కార్యదర్శి అచ్యుతరావు, చీపురుపల్లి కార్యదర్శి మురళి, ముత్యాలమ్మ పాలెం కార్యదర్శి త్రినాధ్, నాయుడుపాలెం కార్యదర్శిరమేష్ మరియుగ్రామవాలెంటర్లీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలకు 'దసరా సెలవు'లపై జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేసిన జేఏసీ సభ్యులు



విశాఖపట్నం : జేఏసీ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలకు 'దసరా సెలవు'లు నిమిత్తం జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్‌కి వినతిపత్రం అందజేయడమైనది. ఈనెల 30వతేదీ నుండి దసరా సెలవులు ప్రారంభం అవుతున్న దృష్ట్యా 3వతేదీ వరకు పాఠశాలలు నడుపుకొనుటకు అనుమతి మంజూరు చేయవలసినదిగా కోరడమైనది. ఇటీవల బంద్‌లు, గిరి ప్రదక్షిణ, జూన్ నెలలో ఎండ తీవ్రత వల్ల పాఠశాలలకు కనీస పనిదినాలు తగ్గి పోయాయి. కాబట్టి దసరా సెలవుల్లో 3రోజులు అదనంగా పాఠశాలలు నిర్వ హించు కొనుటకు అనుమతి మంజూరు చేయవలసినదిగా కోరడమైనది. కలెక్టర్ స్పందించి డీఈవోతో మాట్లాడు తానని తెలిపారు. కలెక్టర్‌ని కలిసిన జెఏసి సభ్యులు పి.భాస్కర్‌రావు(జిప్సా), జె.సోమ శేఖర్ (మేప్స్), వి.రామరాజు (వర్ష), మరియు సభ్యులు రమేష్ నాయుడు, శ్రీనివాసరావు, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# 23న పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నికలు

**-ఈ నెల19 తేదీలోపు అభ్యంతరాలను తెలియజేయాలి**

**- మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ రవీంద్రబాబు**



దేవరాపల్లి : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 23వ తేదీన పాఠశాలల పేరెంట్స్ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు మంగళవారం జరిగిన ప్రధానోపాధ్యాయులు సమావేశంలో మండల విద్యాశాఖాధికారి సిహెచ్. రవీంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలలకు మంగళవారం నుంచి ఎన్నికల నోటిఫికేషన్ అమలైనట్లు తెలిపారు అభ్యంతరాలను ఏమైనా ఉన్నట్లయితే ఈ నెల 19 తేదీలోపు స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలియజేయవచ్చన్నారు.ఇందుకు గాను నిబంధనలు ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కెజిబివి ,పాఠశాలల యందు ఈ పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నికలు పాఠశాలల ప్రధానో పాధ్యాయుల ఆధ్వర్యంలో జరుగుతాయని ఈ ఎన్నికలకు గాను ప్రతి పాఠశాలలో తరగతి వారీగా యాభై శాతం మంది హెూటళ్ల ఆదరణతో ఎన్నికల నిర్వహణ జరపాలని ,అలాగే తల్లిదండ్రులకు ఇద్దరు పిట్ట నుండి వారు వేర్వేరు తరగతులు చదివిన యెడల వారిద్దరూ చెరొక విద్యార్థి తరుపున ఎన్నికల్లో పాల్గొన వచ్చునని తెలిపారు.ఈ ఎన్నికలలో తప్పనిసరిగా చేతులెత్తి లెక్కించడం ద్వారా మాత్రమే నిర్వహించాలని ఒకవేళ అసాధారణ క్లిష్టమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు మాత్రమే సీక్రెట్ బ్యాలెట్ ఓటింగ్ పద్ధతిని నిర్వహిస్తామని తెలిపారు అలాగే పేరెంట్స్ కమిటీలు తప్పనిసరిగా వెనుకబడిన తరగతుల నుండి ఒక్కరు ,షెడ్యూలు కులాలు ,షెడ్యూల్ తెగలకు సంబంధించి ఒకరు అలాగే దివ్యాంగులు లేదా హెచ్ ఐ వి బాధిత తల్లిదండ్రుల నుంచి ఒకరిని తప్పనిసరిగా వండుకోవాలని తెలిపారు అలాగే ఏదైనా పాఠశాలలో పదిహేను మంది విద్యార్థుల కంటే తక్కువ ఉన్నట్లయితే పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రుల అందరినీ సమావేశ పరిచి సభ్యులను ఎన్నుకోవాలని తెలిపారు.అలాగే ఈ ఎన్నికల నిర్వహణలో ఎటువంటి రాజకీయ పార్టీలు జోక్యం ఉండకుండా కచ్చితంగా పారదర్శకంగా రాజకీయాలకు అతీతంగా జరిగేటట్లు చూడాలని, ఎన్నికల నిర్వహించే సమయంలో విద్యార్థుల తల్లి దండ్రులు తప్ప ఇతరులు పాఠశాల ఆవరణంలో లేకుండా చూడాలని ప్రధానోపాధ్యాయులు కు తెలియజేశారు. అలాగే ప్రతి వారు వారికి సంబంధించిన ఐడీ కార్డులను అనగా పాఠశాల జారీ చేసిన గుర్తింపు కార్డు గాని, లేదా ఆధార్ కార్డు, రేషన్ కార్డు,డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ , ఏదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు.

# స్కూల్‌గేమ్స్ అండర్-19 జట్లు ఎంపిక



సబ్బవరం : విశాఖ పట్టణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుండి 30వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ అండర్-19 విద్యార్థినీ, విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని ఆ కమిటీ జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎంవిఎస్ పాత్రుడు, కార్యదర్శి సుజాత ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.రాంబాబులు తెలిపారు.ఈ మేరకు స్థానిక బాలయోగి గురుకుల కళాశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ తీర్మానం ఆమోదించినట్లు వారు ప్రకటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ చదువుతున్న 19 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థినీ, విద్యార్థులకు వారి ఆసక్తి కనుగుణంగా క్రీడలకు ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయిలో జట్ల ఎంపికలకు ఓ షెడ్యూల్‌ను విడుదల చేసినట్టు వారు ప్రకటించారు. అందులో భాగంగా ఈ నెల 18న ఖోఖో, త్రోబాల్ పోటీలకు అనకాపల్లి ఎఎమ్ ఏఎల్ కళాశాలలోను, 19న వాలీబాల్, సాఫ్ట్‌బాల్ ఛాగరీలకు సబ్బవరం బాలయోగి గురుకుల కళాశాలలోను ఎంపికలు జరుగుతాయి. 20న పుట్‌బాల్, చదరంగం, సైక్లింగ్‌లకు గాజువాక భారతీయ పబ్లిక్ స్కూల్, 23న రగ్బీ ఆర్చరీ (విలువిద్య)లకు అడవివరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 24న హేండ్‌బాల్ ఎంపికలు విశాఖపట్నంవన్-టౌన్ మున్సిపల్ స్టేడియం, 26న బాల్‌బాట్మింటన్ కబడ్డీ, చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను, నిర్వహిస్తామన్నారు.అయితే ఈ ఎంపికలో పాల్గొన దలచిన విద్యార్థినీ, విద్యార్థులు సంబంధిత పాఠశాల నుండి పదవ తరగతి మార్కుల జాబితా, ఆన్‌లైన్‌లో రిజిస్టేషన్ ఫారం, అడ్మిషన్ నెంబరుతో పాటు ఉదయం 8.30 ని,,లకు హాజరుకాగలరని వారు విజ్ఞప్తి చేసారు. ఈ సమావేశంలో జిల్లా వృత్తి విద్యాధికారి (డివిఈవో)ఎంవిఎన్ పాత్రుడు, జిల్లా రీజనల్ ఇన్‌స్పెక్టర్ బి.సుజాత, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంబాబు, ఇంకా ఇక్కడి పిడి ఉమామహేశ్వరరావు,అధ్యాపకులు ఎం.వి సురేష్ పాల్గొన్నారు.

# యానాం గోదావరిలో చిన్నారి మృతదేహం లభ్యం - సుస్మితగా గుర్తింపు



యానాం : తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం లోని కచ్చులూరు మందం సమీపంలో ఈ నెల 15న గోదావరి లో జరిగిన బోటు ప్రమాదంలో గల్లంతైన వారి లోని విశాఖ జిల్లా అరిలోవ కు చెందిన చిన్నారి సుస్మిత (4) మృతదేహం మంగళవారం యానాం వృద్ధ గౌతమి గోదావరి లో లభ్యమైంది స్థానిక రాజీవ్ గాంధీ బీచ్ సమీపంలోని చిన్నారి మృతదేహం నదిలో తేలి ఉన్నట్లు మత్స్యకారులు ఇచ్చిన సమా చారం మేరకు యానం ఎస్ పి రచనసింగ్ , సిఐ భక్త్యచలం ఎస్ఐలు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అనంతరం రాజమండ్రి సమాచారం అందించడంతో తాళ్ళరేవు మండల తాసిల్దార్ చిన్న బాబు ఐ.పోలవరం ఎస్ ఐ పోలీసు లతో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని చిన్నారి విశాఖ జిల్లా అరిలోవ కీ చెందిన సుస్మిత గా గుర్తించారు అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నుండి యానం పోలీసుల సమక్షంలో చిన్నారి మృతదేహం రాజమండ్రికి తరలించారు.

# మాజీ స్పీకర్ కోడెలకు చోడవరం టీడీపీ నాయకులు ఘననివాళి



**చోడవరంలో కోడెల శివప్రసాద్‌కు నివాళులర్పిస్తూ పాదయాత్ర చేస్తున్న టీడీపీ శ్రేణులు**

చోడవరం : రాష్ట్ర మాజీ స్పీకర్, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు కోడెల శివప్రసాద్‌కు చోడవరం నియోజక వర్గం టీడీపీ నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. మాజీ శాసన సభ్యులు కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అధ్యక్షతన టీడీపీ కార్యాలయంలో ముందుగా కోడెల శివ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా ఆర్టీసి కాంప్లెక్సు మీదుగా ర్యాలీ నిర్వహిం చారు. అంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ వేధింపులు, రాజకీయ కక్షల కారణంగానే అకాల మృతి చెందారన్నారు. పార్టీనాయకుల తరపున సంతాపాన్ని ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ మాజీ ఛైర్మన్ గూనూరు మళ్ళ నాయుడు, పెదబాబు, మాజీ జెడ్‌పీటీసీ కనిశెట్టి మత్స్యరాజు, ముడుసు గోవింద,మాదిరెడ్డి జోగినాయుడు, నాగులాపల్లి సూర్యనారాయణ, మండలపార్టీ అధ్యక్షులు బొడ్డేడ నాగ గంగాధర్, వేగి శ్రీనివాసరావు, శరగడం శ్రీనివాసరావు, ఆడారి వెంకట అప్పారావు, బుచ్చియ్యపేట, రావికమతం, చోడవరం, రోలుగుంట మండలాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వాలంటీర్లు పారదర్శకంగా పనిచేయాలి : ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



**అనంతగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మొక్కలు నాటుతున్న అరకులోయ శాసనసభ్యులు చెట్టి ఫాల్గుణ**

అనంతగిరి : ఆనంతగిరి మండల కేంద్రంలో వెలుగు కార్యాలయం సమావేశమందిరంలో మంగళ వారం వాలంటీర్లకు హౌసింగ్ సర్వేపైన శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యకమానికి అరకు నియోజకవర్గ శాసన సభ్యులు చెట్టి పాల్గొన ముఖ్యాతిధిగా పాల్గొని వాలంటీర్ల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు నీతి నిజాయితిగా పార దర్శకంగా జబాబుదారిగ ప్రజలను సేవాలందించి ఆదర్శవంతులుగా నిలబడాలని ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని వారు కోరారు అనంతరం ఒక స్వచ్ఛంధసంస్థ నిర్వహిస్తున్న న్యూట్రి గార్డెన్ పరిసించి వారు చిరుధాన్యాలతో తయారుచేసిన స్వీట్ ను రుచిచూసి ఈ ఆహారంలో రోగనిరోధికశక్తి తోపాటు చిన్నారులకు మంచి పోషకఆహారం అని అన్నారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరి మొక్కలు నాటి పర్యవరణం కాపాడాలని అన్నారు.

# ఫారెస్ట్ పోడు భూములు సాగుచేస్తున్న లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్



అనంతగిరి : అనంతగిరి పంచాయతీకి పారేస్టు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో పాడేరు సబ్ కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. మంగళవారం అనంతగిరి వచ్చిన సబ్ కలెక్టర్ కి సిపిఎం నాయకులు గంగరాజు మోస్య లబ్ధిదారులు వినతిపత్రం అందజేశారు ఈకార్యక్రమంలో గంగరాజు మాట్లాడుతూ అటవీ హక్కుల గుర్తింపు చట్టం ప్రకారం ప్రతి ఒక్క కుటుంబానికి 10 ఎకరాల భూమిని ఇవ్వాలని చట్టం ఉన్నా ప్రభుత్వం అమలు చేయడం లేదని అన్నారు స్పందించిన సబ్ కలెక్టర్ సర్వే చేసి అందరికీ పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుండు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కళాబంధు సుబ్బరామిరెడ్డి జన్మదిన వేడుకలు



విశాఖ సిటీ : రాజ్యసభ సభ్యుడు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి జన్మదినం సందర్భంగా ప్రముఖ సినీ నటి డా.జయసుధకు మంగళవారం సాయంత్రం పోర్టు కళావాణి స్టేడియంలో 'అభినయ మయూరి' బిరుదు ప్రదానం చేశారు. ప్రముఖ హీరో, మాజీ ఎంపీ డాక్టర్ ఎం.మోహన్ బాబు బిరుదు ప్రదానం చేయగా ప్రముఖ నటి జయప్రద స్వర్ణ కంకణం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో టటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, సినిమా తారాగణం, విశాఖ యంపీ ఎంవివి సత్యనారాయణ, గంటా శ్రీనివాసరావు, కొయ్య ప్రసాదరెడ్డి, యంపీలు టిజి వెంకటేష్, వైఎస్ఆర్ సీపీ నాయకురాలు ఆర్‌కే రోజా, కాంగ్రెస్ పార్టీ మహిళాధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి మరియు బ్రహ్మానందం, జయప్రద, మురళీమోహన్, జీవితా రాజశేఖర్, జమున, గాయని పి. సుశీల, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, అధికార, అనధికారులు పాల్గొన్నారు.







కళాబంధు టీ. సుబ్బరామిరెడ్డి జన్మదిన వేడుకలలో పాల్గొనేందుకు విశాఖపట్నం చేరుకున్న ఎంపీ ( రాజ్యసభ ) కేవీపీ రామచంద్ర రావుకు విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, నగర అధ్యక్షుడు సంకు వెంకటేశ్వరరావు మరియు నగర నాయకులు



# దివ్యాంగులకు బిజెపీ అండగా ఉంటుంది

- సేవా సప్తాహ్‌లో దివ్యాంగులకు ఉపకారణాల పంపిణీ
- యావత్‌ప్రపంచానికే మోదీ ఆదర్శం
- కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు సుజనా చౌదరి




విశాఖపట్నంః భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవం పురస్కరించుకొని సేవా సప్తాహ కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ మరియు శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో 370 మంది దివ్యాంగులకు 20 లక్షల విలువ గల ఉపకరణముల పంపిణీ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు వైఎస్.చౌదరి (సుజనా చౌదరి) ప్రసంగిస్తూ దివ్యాంగులకు ప్రధాని మోడీ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. ముఖ్యంగా సమాజ సేవలో యువతీ యువకులు పాల్గొని దేశానికి కీర్తి ప్రతిష్టలు తేవాలని అన్నారు.

గౌరవ అతిధి రాజ్యసభ సభ్యులు టిజి.వెంకటేష్ ప్రసంగిస్తూ ప్రధాని మోడీ సేవా కార్యక్రమాల్లో గాంధీజీని స్ఫూర్తిగా తీసుకున్నారని, ధైర్యంతో భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకున్నారని, యావత్ ప్రపంచానికి మోడీ ఆదర్శంగా ఉన్నారని తెలియజేశారు. దివ్యాంగులకు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ పెంచిన ఘనత మోడీదే అన్నారు.

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, విశాఖపట్నం మాజీ ఎంపీ డా.కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ ఈ ఉపకరణముల పంపిణీకి సహకారం అందించిన శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ అధినేత రాపర్తి జగదీష్ బాబుని అభినందించారు. విశాఖలో దివ్యాంగులకు క్రీడా ప్రాంగణం నిర్మించుటకు, కలెక్టర్ కార్యాలయం, జిల్లా కోర్టులలో లిఫ్ట్ సౌకర్యం కల్పించుటకు తనవంతు క ృషి చేశానని అన్నారు.



ఈ కార్యక్రమంలో ఇటీవల పూరీలో జరిగిన జాతీయ యోగా పోటీలలో విశాఖ జిల్లా యోగా అసోసియేషన్ సభ్యులకు ముగ్గరికి బంగారు పతకములు, ఇద్దరికీ రజత పతకములు వచ్చిన వారిని యోగా అసోసియేషన్ అధ్యక్షురాలు శిష్టా శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ముఖ్య అతిధి చేతుల మీదుగా సన్మానించారు. 370 మంది దివ్యాంగులకు వీల్‌ఛైర్‌లు, ట్రై సైకిల్స్, కాలిపర్స్, వినికిడి యంత్రములు, క ృత్రిమ అవయవములు, రోలేటర్స్, కుట్టు మిషన్‌లు, బ్లైండ్ స్టిక్స్, షూస్ మొదలగు ఉపకరణములు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర పూర్వ, మాజీ అధ్యక్షులు, పి.వి.చలపతిరావు, బీజేపీ మాజీ శాసన సభ్యులు పి.విష్ణుకుమార్‌రాజు, సుహాసినీ ఆనంద్, నగర బీజేపీ అధ్యక్షులు ఎం.నాగేంద్ర, నగర సేవా సప్తాహ కన్వీనర్ రూపాకుల రవికుమార్, రాపర్తి జగదీష్ బాబు, వైజాగ్ ప్రొఫైల్స్ సురేష్‌బాబు మరియు ఇతర బీజేపీ నేతలు పి.వి.నారాయణ రావు, ఎస్‌విఎస్.ప్రకాష్ రెడ్డి, కె.సుహాసిని ఆనంద్, కె.పావని, వి.లలిత, సిహెచ్. సత్యనారాయణ ఆనంద్, రవి, పి.ఈశ్వర్ వర్మ, ప్రదీప్ కుమార్ మరియు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోడెల మరణంపై ఎమ్మెల్యే రోజా వ్యాఖ్యలు

అమరావతిః మాజీ స్పీకర్, టీడీపీ సీనియర్ నేత కోడెల శివప్రసాదరావు మరణం చుట్టూ వివాదం నడుస్తోంది. ఆయన చనిపోడానికి ప్రభుత్వం కేసులతో వేధించడం కాదు, టీడీపీలో విభేదాలు అన్నారు.

# గ్లోబల్ ఎయిడ్‌కు ఎల్ఐసి అంబులెన్స్ బహుకరణ



విశాఖపట్నం: భారతీయ జీవిత బీమా సంస్థ 63 వార్షికోత్సవ సందర్భంగా, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా గ్లోబల్ ఎయిడ్ అనే నాన్ గవర్న మెంటల్ ఆర్గనైజేషన్ సంస్థకు ఒక అంబులెన్సుని బహూకరిం చింది. గ్లోబల్ ఎయిడ్ సంస్థ 2008 నుండి విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో గిరిజన మరియు వెనకబడిన ప్రాంతాల్లో శిశు సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. పిల్లల్లో ఆరోగ్యం, విద్య, వైదానికి సంబంధించి బహుళ కార్యక్రమాలు చేపట్టింది.

# యోగ విద్యను విశ్వవ్యాప్తం చేయాలి

ఆంధ్రవిశ్వకళాపరిషత్ : యోగ విద్యను విశ్వవ్యాప్తం చేయాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. సౌత్ కొరియాలో ఇటీవల జరిగిన 9వ ఆసియన్ యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని సాధించిన ఏయూ యోగా విభాగం విద్యార్థిని టి.కళ్యాణిని వీసీ తన కార్యాలయంలో అభినందించారు. ప్రస్తుతం కళ్యాణి సిఐడి విభాగంలో సర్కిల్ ఇనస్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. మరింత మందిని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే విధంగా తర్ఫీదును అందించాలని సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య కె.వెంకట రావు, యోగా విభాగాధిపతి డాక్టర్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారికి సువర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన



బురుజుపేటః శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో మంగళవారం స్వర్ణ పుష్పార్చన (అష్టదళ పద్మారాధన) 108 స్వర్ణపుష్పాలతో ప్రత్యేక పూజ ఉదయం. నిర్వహించుట జరిగినది. ఈ పూజలో ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతీ మంగళవారం నిర్వహించబడును పూజ రుసుము రూ. 1,116/-లు చెల్లించిన యెడల ఈ పూజకు దంపతులను అనుమతించబడును.

**శ్రీ అమ్మవారిని దర్శించుకున్న కర్నాటకకు చెందిన శ్రీశ్రీశ్రీ గోవిందానంద స్వామీజీ**

శ్రీ అమ్మవారిని మంగళవారం శ్రీశ్రీశ్రీ గోవిందానంద స్వామీజీ దర్శించుకున్నారు. శ్రీ అమ్మవారి దర్శనమునకు విచ్చేసిన వారికి కార్యనిర్వాహణాధికారి వారు స్వాగతం పలికి ప్రత్యేక పూజ నిర్వహించారు. పూజ అనంతరం ప్రసాదం, శేషవస్త్రం అందజేయుట జరిగినది. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి ఎన్.వి.ఎస్.ఎన్. మూర్తి, ఉప కార్య నిర్వాహక ఇంజనీరు సిహెచ్.వి. రమణ, పర్యవేక్షకులు ఎన్.వి.వి.ఎస్.ఎస్.ఎన్.ఎన్. రాజు, తదితరులు పాల్గొన్నారు.

# పోర్ట్‌ట్రస్ట్ పరిధిలో స్వచ్ఛభారత్

కళాకారుల ఆధ్వర్యంలో స్కిట్ ప్రదర్శన .. విద్యార్థులచే స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ



విశాఖపట్నంః పోర్ట్ ట్రస్ట్ పరిధిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం కొనసాగుతోంది. స్వచ్ఛభారత్ లో భాగంగా పరిసరాల పరిశుభ్రత పై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని రూపొందిం చారు. ఇందులో భాగంగా పోర్టు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో స్కిట్ ను ప్రదర్శించారు. జ్ఞానాపురంలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్లో ఈ స్కిట్ ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రత యొక్క ఆవశ్యకత, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టం, అవగాహన లేకుండా పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్న వైనంపై కళ్ళకు కట్టినట్లు స్కిట్‌లో వివరించారు.

ఇందులో భాగంగా పరిసరాల పరిశుభ్రత ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించాలని పోర్ట్ అధికారులు స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞను స్కూల్ విద్యార్థులచే చేయించారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ సెక్రెటరీ సి.హరి హరిచంద్రన్, పోర్టు ఎఫ్ అండ్ ఏ శివ కుమార్, పోర్ట్ విభాగాధిపతులు సీనియర్ అధికారులు, ఉద్యోగులు, సెయింట్ పీటర్స్ పాఠశాల అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com